

- అడంగల్ అవస్థలకు చెక్
- భూ విక్రయాలకు లైన్‌క్లియర్
- మూడేళ్ల సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం
- తెనాలిలో రెవెన్యూ శాఖ ప్రయోగం విజయవంతం
- ఈ దిశగా అంతటా పరిష్కారం చూపితే ఫిర్యాదులు తగ్గినట్లే

కాలమ్-6.. సరిదిద్దారు

భూ రికార్డుల ఆధునికీకరణలో జరిగిన పొరపాట్లు.. వైసీపీ హయాంలో చేసిన తప్పులు.. భూ యజమానులకు గుదిబండగా మారాయి. తరతరాల నుంచి వచ్చినా.. రెక్కల కష్టంతో కొనుగోలు చేసినా.. అవి ప్రభుత్వ భూములుగా చూపించడంతో యజమానులు విలవిలలాడిపోయారు. క్రయవిక్రయాలు లేక అల్లాడిపోయారు. కాలమ్ నంబరు-6లో సవరణ.. వేల మంది భూ యజమానులకు సంకటంగా మారింది. అత్యవసర సమయంలో అమ్ముకుంటే ఆర్థికంగా అండగా ఉంటుందనుకున్న భరోసాతో ఉన్న యజమానులకు అడంగల్‌లో జరిగిన లోపాలు కొరకరాని కొయ్యగా మారాయి. ప్రభుత్వం పట్టించుకోలేదు. అధికారులు సమస్యపై దృష్టి సారించలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజా ఫిర్యాదులు పరిష్కారానికి శ్రీకారం చుడితే, ఇందులో అందుతున్న ఫిర్యాదుల్లో ఈ తరహావే 60 శాతం ఉన్నాయంటే సమస్య తీవ్రతకు అద్దంపడుతుంది. ఈ తరుణంలో గుంటూరు జిల్లా రెవెన్యూ అధికారులు దీనిపై దృష్టిపెట్టారు. తప్పు జరిగిన మూలాలనే సరిదిద్దే కార్యక్రమం చేపట్టడంతో రైతుల సమస్య కు పరిష్కారం లభించింది.





తెనాలి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): భూముల రికార్డులను కంప్యూటరీకరించే సమయంలో జరిగిన పొరపాట్లు రైతుల మెడకు గుదిబండలా మారాయి. రైతులకు అడంగల్‌లోని కాలమ్ నంబరు-6లో జరిగిన లోపాలు కొరకరాని కొయ్యగా మారాయి. అమ్మబోతే ప్రభుత్వ భూమిని నువ్వెట్లా అమ్ముతావని రిజిస్ట్రేషన్ శాఖ తిప్పి పంపితే, పట్టా ఉండి, సర్వ హక్కులూ ఉన్నా ఇదేం ఖర్మంటూ రైతులు ఆవేదన వర్ణనాతీతం. ఇది ఏదో ఒక్క మండలానికో.. గ్రామానికో పరిమితం కాలేదు. రాష్ట్రం మొత్తంమీద ఇదే పరిస్థితి. భూ రికార్డుల కంప్యూటరీకరణ సమయంలో కొందరు సిబ్బంది నిర్లక్ష్యం, త్వరితగతిన పూర్తిచెయ్యాలన్న అప్పటి అధికారుల ఒత్తిడితో రైతుల భూ హక్కులకు ఇబ్బందులు వచ్చిపడ్డాయి. 2012కు ముందు క్రాస్ అనే సాఫ్ట్‌వేర్‌తో మాన్యువల్‌గా భూ రికార్డులను తయారు చేసేది. 2012లో వెబ్‌లాండ్ సాఫ్ట్‌వేర్ రావడంతో అన్ని రికార్డులను కంప్యూటరీకరించారు. అయితే ఆ సమయంలో అందుబాటులో ఉన్న రికార్డులను ఉన్నవి ఉన్నట్లు ఎక్కించేస్తే, అందుబాటులో లేనివి, ఉన్నా పొరపాటు కారణంగా కాలం నంబరు 6లో తప్పుగా నమోదు చేశారు. ఇక్కడ ప్రభుత్వ భూమా? పట్టా భూమా అని ఉండాల్సి ఉంటే, దాని స్థానంలో రైతులకు అన్ని హక్కులున్నా, ప్రభుత్వ భూమిగా నమోదు చేసేశారు. వైసీపీ సర్కారు వచ్చాక ఇంకొన్ని కావాలనే స్థానిక నేతల ఒత్తిడితో మార్చేశారు. గతంలో ఇలాంటి తప్పులను సవరించడానికి తహసీల్దార్లకు అవకాశం ఉండేది. అయితే దీనివల్లే సమస్యలు ఎక్కువ అవుతున్నాయని తెలిసి కలెక్టర్, జేసీ స్థాయి అధికారి అనుమతి లేకుంటే భూముల రికార్డుల్లో మార్పులకు వీలు లేకుండా లాక్ విధానాన్ని తీసుకొచ్చారు. ఈ క్రమంలో తప్పులను సరిదిద్దండి మహాప్రభో అంటూ వైసీపీ ప్రభుత్వంలో రైతులు చెప్పులరిగేలా కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకున్న నాథుడే లేడు. నంబరు-6 సమస్యకు ఆర్.ఎస్.ఆర్ ఆధారంగా మార్పులు చేసే అవకాశం ఉన్నా అధికారులు ఆ దిశగా చేసిందేలేదు. పైగా రైతుల అవసరాన్ని సొమ్ము చేసుకునేందుకు కావాలనే దరఖాస్తులో లోపాలు చూపించి మూడేళ్లుగా తిప్పుతూనే వచ్చారు.

సీఎంకు అందిన అర్జీతో.. తెనాలిలో తీగలాగితే

తెనాలికి చెందిన ఖాజాబీ అనే మహిళ తన కుమారుడి ఆరోగ్యం సరిగాలేదని, తనకున్న భూమిని అమ్మితేనే వైద్యం చేయించుకుని బతికించుకోగలని

(మిగతా 8వ పేజీలో..)

త్రిశంకు స్వర్గంలో.. మీ సేవ

- ఆదరణ కోల్పోతున్న కేంద్రాలు
- ఆదాయం లేక ఆపరేటర్ల అవస్థలు
- నడపలేక.. మూసివేయలేక అయోమయం
- దెబ్బతీసిన వైసీపీ ప్రభుత్వం.. కూటమిపైనే ఆశలు



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విద్యార్థులకు ధృవీకరణపత్రాలు.. బర్త్, డెత్ సర్టిఫికెట్లు కావాల్సి వస్తే మీ సేవా కేంద్రాలు. ఓటరు కార్డుల్లో మార్పులు చేర్పులు చేసుకోవాలంటే మీ సేవా కేంద్రాలు. ఇంటి పన్నులు, నీటి పన్నులు, విద్యుత్ బిల్లులు కట్టాలన్నా మీ సేవా కేంద్రాలు.. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి టీడీపీ హయాంలో చంద్రబాబు మీ సేవా కేంద్రాలను ప్రవేశపెట్టారు. ప్రజలకు వివిధ రకాల ప్రభుత్వ సేవలు అందించేలా వీటిని తీర్చిదిద్దారు. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీ సేవా కేంద్రాలను నిర్వీర్యం చేసింది. అప్పటి నుంచి ప్రభుత్వ ఆదరణ లేక త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతంత మాత్రంగా ఉన్న సర్వీసులతో ఆదాయం లేక ఆపరేటర్లు అవస్థలు పడుతున్నారు. అటు నడపలేక, ఇటు మూసివేయలేక అయోమయంలో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం మీసేవలను పూర్తిగా దెబ్బతీయగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మీసేవలకు పూర్వ వైభవం తీసుకువస్తుందని ఆపరేటర్లు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజలకు పౌరసేవల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, టీసీఎస్ భాగస్వామ్యంలో మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేశారు. చంద్రబాబు మొదటి సారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన సమయంలోనే దశల వారీగా మీ సేవా కేంద్రాల్లో టెక్నాలజీ ఆధారిత పౌరసేవలు అందుబాటులోకి వచ్చాయి. 2019లో గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాక మీసేవా కేంద్రాల అవసరం తగ్గిపోయింది. మీసేవా కేంద్రాల నిర్వాహకులు హైకోర్టును ఆశ్రయించడంతో వాటిని కొనసాగించాలని ఆదేశించడంతో కొన్ని చోట్ల అవి కొనసాగుతున్నాయి. 2014-19 వరకు దాదాపు 350 రకాల సేవల్ని మీసేవా కేంద్రాల్లో అందించేవారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాల రాకతో అంతకు ముందు ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రాలు మరుగున పడిపోయాయి. రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్, ఆస్తులకు సంబంధించిన సర్టిఫైడ్ కాపీలు, ఆస్తులు, వ్యవసాయ భూముల కొనుగోళ్లలో మ్యూటేషన్ పత్రాలను కూడా మీ సేవా కేంద్రాల్లో జారీ చేసేవారు. ప్రస్తుతం ఈ తరహా సేవలను రద్దు చేశారు. గతంలో రాష్ట్రంలో ఎక్కడి ఆస్తులకు ఎక్కడైనా ఈసీలు పొందే వెసులుబాటు ఉండేది. సచివాలయాల రాకతో అవన్నీ మాయమయ్యాయి. మీ

(మిగతా 6వ పేజీలో..)



ప్రమాదంలో ధ్వంసమైన లారీలు

3

పది నిమిషాల్లో మూడు లారీలు ఢీ.. ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం

గుంటూరు జిల్లా బుడంపాడు వద్ద ఘోరం

నదిలో మునిగి భార్య మృతి..

- రక్షించే యత్నంలో భర్త గల్లంతు
- సత్రశాల వద్ద కృష్ణానదిలో స్నానానికి దిగిన వేళ విషాద ఘటన

6

పూరిల్లు దగ్ధం.. వృద్ధుడి సజీవ దహనం

సర్‌చార్జికి.. సున్నం

8



- దారి మళ్లించిన జగన్ ప్రభుత్వం
- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్, మైనింగ్ రాయల్టీ పెండింగ్
- ఐదేళ్లలో చెల్లింపులు లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం

బోరుగడ్డకు రాచమర్యాదలపై కొనసాగుతున్న దర్యాప్తు

- మరో కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళిక

- బీసీ భవన్ ఆవరణల్లోనే స్టడీసర్కిల్స్ నిర్మాణం
- చిన్న మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ఆర్థిక చేయూత
- డీఎస్సీ ఉచిత శిక్షణా తరగతుల ప్రారంభ సభలో మంత్రి సవిత

గుంటూరు(విద్య), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల కోసం కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని, వారి అభ్యున్నతే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తుందని బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. గుంటూరు రాజాగారితోటలోని బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించి డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల్ని తయారు చేసేందుకు ఆర్థిక చేయూత, ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా యువతకు రుణాలు మంజూరు చేసి వారి స్వయం ఉపాధికి కృషి చేస్తామన్నారు. ప్రతీ జిల్లాలో బీసీ భవన్ నిర్మాణం కోసం ఒకటిన్నర ఎకరాల భూమి సేకరించామని అందులో కొంతభాగంలో స్టడీసర్కిల్ భవనం నిర్మించి నిరుద్యోగ యువతకు వివిధ ఉద్యోగ పరీక్షలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా రాష్ట్రంలో 5720 మందికి డీఎస్సీ శిక్షణ ఇస్తున్నామని, శిక్షణను సమర్థవంతంగా ఉపయోగించుకుని ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. శిక్షణలో నెలకు రూ.1500 స్టయిఫండ్, పుస్తకాలకు రూ.1000 చొప్పున అందిస్తామన్నారు. ప్రస్తుతం ఆఫ్‌లైన్ ద్వారా ఇచ్చే డీ ఎస్సీ శిక్షణను త్వరలో ఆన్‌లైన్ ద్వారా కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమశాఖ కమిషనర్ పోలా భాస్కర్ మాట్లాడుతూ త్వరలో స్టడీసర్కిల్స్‌లో సివిల్ సర్వీసెస్‌కు శిక్షణ ఇస్తామన్నారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ డీఎస్సీ శిక్షణకు సమర్థవంతమైన అధ్యాపకుల్ని నియమించాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏసురత్నం, ఎమ్మెల్యే నసీర్, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ మల్లికార్జునరావు, జేడీ తనూజారాణి, అదనపు డైరెక్టర్ చంద్రశేఖర్, కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ, బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎస్ మయూరి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత, కార్యక్రమానికి హాజరైన డీఎస్సీ అభ్యర్థులు, విద్యార్థులు

బుగ్గవాగు ప్రాంగణం.. అంధకారం

- అలంకార ప్రాయంగా విద్యుత్ పోల్స్
- పట్టించుకోని పాలకులు, అధికారులు

రెంటచింతల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): లక్షలాది ఎకరాలకు సాగు నీరందించే.. అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా మారే.. మంచికల్లు బుగ్గవాగు రిజర్వాయర్ ప్రాంగణం గాఢాంధకారంలో ఉంది. లక్షలాది రూపాయల ప్రజాధనం నీటి పాలై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. రెంటచింతల మండలం మంచికల్లు గ్రామ పరిధిలో 3300 ఎకరాల్లో బుగ్గవాగు రిజర్వాయర్‌ను నిర్మించారు. గుంటూరు ప్రకాశం జిల్లాల పరిధిలోని 11 లక్షల 17 వేల ఎకరాలకు సాగునీరందిస్తుంది. ఇక్కడ 170 డెకరేటివ్ పోల్స్, 40 సింగిల్ ఆర్స్ పోల్స్, 6 హైమాస్క్ లైట్లు, త్రీఫేజ్ కరెంట్ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేశారు. అయితే మిరుమిట్లు గొలిపే కాంతితో బుగ్గవాగు ధగధగ మెరిసిపోతుందని భావిస్తే తప్పులో కాలేసినట్లే. ఇక్కడ విద్యుత్ సౌకర్యాలు ఉన్నా అవి వినియోగంలో లేవు. ట్రాన్స్‌పార్మర్ నుంచి విద్యుత్ సరఫరా లేక సాయంత్రం అయితే అంధకారం అలుముకుంటుంది. గత పాలకుల పనితీరును వెక్కిరించేలా తుప్పు పట్టిన షట్టర్లు, ట్రాన్స్‌పార్మర్ దర్శనమిస్తాయి. 6 షట్టర్లపై భాగాన లైట్లు ఉన్నా వెలిగిన దాఖలాలు లేవు. నాగార్జునసాగర్ కుడికాల్వ కింద బుగ్గవాగు రిజర్వాయరు నిర్మాణ పనులు 1955లో ప్రారంభించి 1967లో ముగించారు. గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తాత తిరుమలయ్య కృషి ఫలితంగా ప్రాజెక్టు పట్టాలెక్కింది. అప్పటి ఉప ప్రధాన మొరార్జీ దేశాయ్ 1967 జులై 16న ప్రాజెక్టును ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ప్రారంభంలో 4.5 టీఎంసీల నీరు నిల్వ చేసినప్పటికీ కాలక్రమేణా పూడిక పేరుకుపోవడంతో 3.463 టీఎంసీలకు మించి నీరు నిల్వ చేసే అవకాశం లేకుండాపోయింది. చిట్టడవిలా ఉండే రిజర్వాయర్ ప్రాంతం పాములకు ఆవాసంగా మారింది. రాత్రి వేళల్లో చిమ్మ చీకట్లు అలుముకోవడంతో విధులు నిర్వహించే వాచ్‌మన్, లస్కర్లకు ఎంతో ఇబ్బందికరంగా మారింది.





అలంకార ప్రాయంగా హైమాస్క్ లైట్లు



ముళ్ల కంపలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్

ఆధునికీకరణపై సీఎం దృష్టికి..

బుగ్గవాగు రిజర్వాయరు ఆధునికీకరణ, ఇక్కడి సమస్యల గురించి సీఎం చంద్రబాబుకు దృష్టికి తీసుకెళ్తాను. పర్యాటక కేంద్రంగా చేయడానికి అన్ని హంగులున్నాయి. పాపికొండలు తరహాలో బుగ్గవాగు, టెయిల్‌పాండ్ రిజర్వాయర్‌ను అభివృద్ధి చేసి బోట్ సౌకర్యం కల్పించాలనే విషయాన్ని ఎమ్మెల్యే యరపతినేనితో కలిసి సీఎం చంద్రబాబు, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు వివరిస్తాను.



- బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే మాచర్ల

నదిలో మునిగి భార్య మృతి.. రక్షించే యత్నంలో భర్త గల్లంతు


పద్మావతి(ఫైల్)

రెంటచింతల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సత్రశాలలోని కృష్ణానదిలో మునిగి భార్య మృతి చెందగా, ఆమెను రక్షించే యత్నంలో భర్త గల్లంతైయ్యారు. ఆయన ఆచూకీ శనివారం రాత్రి వరకు లభ్యం కాలేదు. ప్రత్యక్ష సాక్షులు, ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని తుమ్మ కోట గ్రామానికి చెందిన నీలా సత్యనారాయణ, పద్మావతి దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు అమ్మాయిలకు వివాహం కాగా కుమారుడు గోపి అవివాహితుడు. ఈ కుటుంబం 11 సంవత్సరాల క్రితం రెంటచింతలకు వచ్చి స్థిరపడి మిర్చి వ్యాపారం చేశారు. శనివారం ఉదయం కృష్ణానదిలో స్నానమాచరిస్తున్న సమయంలో పద్మావతి కాలు జారి నదిలోకి వెళ్లింది. దీనిని గమనించిన భర్త సత్యనారాయణ ఆమెను రక్షించడం కోసం ప్రయత్నించారు. ఈ క్రమంలో సత్యనారాయణ కూడా నదిలో గల్లంతైయ్యారు. పద్మావతి మృతదేహం 100 అడుగుల దూరంలో మత్స్యకారులకు లభ్యమైంది. కుమారుడు గోపి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పూరిల్లు దగ్ధం.. వృద్ధుడు సజీవ దహనం


వెంకటేశ్వర్లు(ఫైల్)

సత్తెనపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పూరిల్లు దగ్ధమై వృద్ధుడు సజీవ దహనమైన సంఘటన మండలంలోని లక్కరాజుగార్లపాడులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు శనివారం తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన పుట్టి వెంకటేశ్వర్లు(80) పూరింట్లో నివసిస్తున్నారు. కుమారులు కూడా అదే గ్రామంలో మరొక గృహంలో నివసిస్తుండగా వెంకటేశ్వర్లు భార్య శాంతమ్మ మూడేళ్ల క్రితం మరణించింది. అప్పటి నుంచి పూరింట్లో ఒంటరిగా ఉంటున్నాడు. రాత్రి సమయంలో పూరింటి నుంచి మంటలు రావటం గమనించిన స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా అప్పటికే గృహాన్ని చుట్టుముట్టాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి వచ్చి మంటలను ఆర్పగా వెంకటేశ్వర్లు అప్పటికే పూర్తిగా కాలిపోయాడు. రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సంఘటనపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

ఆరు చోరీ కేసుల్లో నిందితులకు జైలు

నరసరావుపేట లీగల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆరు చోరీ కేసుల్లో నిందితులు పట్టణానికి చెందిన తమ్మిశెట్టి శివ నాగరాజు, మన్నెం రవిలకు ఒక్కొక్కరికి ఒక్కొక్క కేసులో ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్థానిక మొదటి అదనపు ఇన్‌చార్జి సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆశీర్వాదం పాల్ శనివారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నిందితులు ఇద్దరు వివిధ ప్రాంతాల్లో 16 మోటార్ సైకిళ్ల చోరీ చేశారు. వీటిలో ఐదు మోటరు సైకిళ్ల నరసరావుపేట మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో, ఒక మోటార్ సైకిల్ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీ చేశారు. పోలీసులు దర్యాప్తు అనంతరం అభియోగపత్రం దాఖలు చేశారు. నిందితుల వద్ద నుంచి 16 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్‌ను ఏపీపీ లక్ష్మీ రామ్ నాయక్ నిర్వహించారు.

మంత్రి పేరుతో నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్

- ఆ కారుల్లో తిరుగుతున్న వైసీపీ నాయకుడు మహీధర్
- మహీధర్ అరెస్టు.. రెండు కార్లు సీజ్
- రేపల్లె సీఐ మల్లికార్జునరావు

రేపల్లె, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేరుతో నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్లు పెట్టుకుని కారుల్లో తిరుగుతున్న వైసీపీ నాయకుడు మోర్ల మహీధర్‌ను అరెస్టు చేసి రెండు కార్లు సీజ్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇంకో కారును కూడా సీజ్ చేయాల్సి ఉందన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రేపల్లె పట్టణంలోని 3వ వార్డుకు చెందిన దేవగిరి రవిశంకర్‌కు రెండు నెలల క్రితం వెలగపూడి సచివాలయం వద్ద ఎన్టీఆర్ జిల్లా గన్నవరం మండలం నిడమానూరుకి చెందిన మోర్ల మహీధర్ పరిచయం అయ్యాడు. తనకు మంత్రులు, హైకోర్టు జడ్జీలు బాగా తెలుసని సచివాలయంలో కాంట్రాక్టు ఉద్యోగం ఇప్పించి తరువాత పర్మినెంట్ చేపిస్తానని నమ్మబలికాడు. 14వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో రేపల్లె పట్టణానికి చెందిన రవిశంకర్ ఇంటి వద్దకు టీఎస్09ఈజడ్1133 నంబరు గల ఓల్డు ఫార్చునర్ కారులో వచ్చి డబ్బులు తీసుకుని తనవెంట వస్తే ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడు. సదరు కారుపై మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్యే స్టిక్కర్ ఉండటంతో రవిశంకర్ గట్టిగా అడిగాడు. దీంతో మహీధర్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. దీనిపై రవి శంకర్ ఫిర్యాదు మేరకు సీఐ మల్లికార్జునరావు కేసు నమోదు చేశారు. విచారణ నిమిత్తం సీఐ ఎన్టీఆర్ జిల్లా నిడమానూరు వెళ్లగా, మూడు కారులకు రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎమ్మెల్యే నకిలీ స్టిక్కర్ ఉండటాన్ని గుర్తించారు. సీఐను చూసి ఫార్చునర్ 1133కారును పంపించేశారు. టీఎస్07ఈవీ0707 నంబర్‌గల ఓక్స్‌వ్యాగెన్ వైట్‌కారు, ఏపీ23ఎస్9999 నంబర్ గల ఇన్నోవా గ్రీన్ కలర్ కారును స్వాధీనం చేసుకున్నారు. మోర్ల మహీధర్‌ను అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పర్చగా, కోర్టు రిమాండ్ విధించింది.


పోలీసులు సీజ్ చేసిన నకిలీ ఎమ్మెల్యే స్టిక్కర్ పెట్టుకుని తిరుగుతున్న కారు


మాజీ సీఎం జగన్‌రెడ్డితో కరచాలనం చేస్తున్న వైసీపీ నాయకుడు మోర్ల మహీధర్

వైసీపీ ప్రభుత్వం హయాంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని..

వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి, అప్పటి గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌తో మంచి సాన్నిహిత్యం ఉందని చెప్పి చల్లపల్లి, నరసరావుపేట, గుంటూరు, విజయవాడ, పెనమలూరు, మాచర్ల తదితర ప్రాంతాల వ్యక్తులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి వద్ద రూ. 5 లక్షల నుంచి రూ.10 లక్షలు వరకు వసూలు చేశాడు. ఇప్పటికే ఇతనిపై వివిధ పోలీస్ స్టేషన్‌లలో ఆరు కేసులు నమోదు అయ్యాయి. ఇది ఏడో కేసు. వైసీపీ పాలనలో ఏపీ బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహీధర్ బాధ్యతలు నిర్వహించాడు.

రెండు బైక్‌లు ఢీ... ఒకరు మృతి

- ఇద్దరికి గాయాలు

మాచవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండల పరిధిలోని తురకపాలెం, మాచవరం గ్రామాల మధ్య శనివారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. పిన్నెల్లి గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌వలి(27), షేక్ చిన దరియావలి తురకపాలెం నుంచి ద్విచక్ర వాహనంపై మాచవరం వైపు వెళ్తున్నారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన క్రాంతి శ్రీను మాచవరం నుంచి ద్విచక్ర వాహనంపై తురకపాలెం వైపు వెళ్తున్నాడు. తురకపాలెం, మాచవరం గ్రామాల మధ్య ఈ రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా బలంగా ఢీకొనటంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. షేక్ మస్తాన్‌వలి, షేక్ చిన దరియావలిలను చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో షేక్ మస్తాన్‌వలి మృతి చెందాడు. షేక్ చిన దరియావలి, క్రాంతి శ్రీనులకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ సతీష్ తన సిబ్బందితో సంఘటనా స్థలాన్ని పరిశీలించి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


మస్తాన్‌వలి(ఫైల్)

ధనుర్మాస వ్రత ఏర్పాట్లను పరిశీలించిన చిన్నజీయర్ స్వామి


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న చిన్నజీయర్ స్వామి

మంగళగిరి సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి బాపూజీ విద్యాలయంలో డిసెంబరు 16వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ధనుర్మాస వ్రత మహోత్సవ ఏర్పాట్లను త్రిదండి చిన్నజీయర్ స్వామి శనివారం పరిశీలించారు. చాతుర్మాస దీక్ష విరమించి ధనుర్మాస ప్రత్యన్న శ్రీకృష్ణ దీక్ష ప్రారంభం కోసం సీతానగరంలోని విజయకీలాద్రిలో 108 మంది భక్తులకు శ్రీకృష్ణ దీక్షను చిన్నజీయర్ స్వామి ప్రారంభించారు. అనంతరం పెద్దస్వామి వారి ఆశ్రమానికి వెళ్తూ మంగళగిరిలో ధనుర్మాస వ్రత మహోత్సవ ఏర్పాట్లను టెంకాయ కొట్టి ప్రారంభించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులకు మంగళ శాసనాలు, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో తులసీరామ్ యాదవ్, వికాస తరంగిణి ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

సాంకేతిక రంగంలో ఊహించని మార్పులు

- విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ రత్తయ్య


రాజకుమారి, ముకుందరావు దంపతులను సత్కరిస్తున్న లావు రత్తయ్య, వీరనారాయణ

తెనాలి అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక రంగంలో ఊహించని మార్పులు రానున్నాయని, కృత్రిమ మేధ రాజ్యమేలుతుందని విజ్ఞాన్ విద్యా సంస్థల అధిపతి లావు రత్తయ్య చెప్పారు. బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో శనివారం పావులూరి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదర్శ దంపతుల పురస్కారాన్ని మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, ముకుందరావు దంపతులకు ప్రదానం చేశారు. రావిపాటి వీరనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ నేటితరం పిల్లలు సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. అన్ని రంగాల్లో మనుషులతో పని లేకుండా సేవలందే కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకోవాలంటే ప్రతి విద్యర్థిలోనూ నైపుణ్యాలు పెంపొందాలన్నారు. పెద్దగా చదువుకోకపోయినా రాజకీయ రంగంలో ఎంతో ఎత్తుకు ఎదిగిన రాజకుమారి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు ప్రత్యూష సుబ్బారావు మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరిన ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను పూజించిన వారేనని ఉదహరించారు. బిడ్డల కోసం తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడితే వృద్ధాప్యంలో వారిని ఆదరించే పరిస్థితులు సమాజంలో లేకపోవడం దురదృష్టకరమన్నారు. ట్రస్టు కార్యదర్శి పావులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో తల్లిదండ్రులు నిరాదరణకు గురవుతుండటం బాధించిందని, అందుకే ఆదర్శ దంపతుల పురస్కార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో నన్నపనేని సుధాకర్, గుత్తా వెంకటరత్నం, రామరాజు, భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

త్రిశంకు స్వర్గంలో.. మీ సేవ

(5పేజీ తరువాయి)

సేవల్లో రద్దయిన సేవలను సచివాలయాల్లో అందిస్తున్నారా అంటే అది కూడా లేదు. దీంతో ప్రజలు తిరిగి మీ సేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన ఉద్యోగాలు, విధులపై జాబ్ ఛార్ట్‌ను ఖరారు చేయకపోవడమే ఈ రకమైన సమస్యకు కారణం అవుతోంది. సచివాలయాల్లో జారీ చేసే ధృవీకరణ పత్రాల విషయంలో మరో సాంకేతిక సమస్య ఎదురవుతోంది. మీ సేవా కేంద్రాల్లో నిర్ణీత రుసుము చెల్లిస్తే ఎన్ని కాపీలైనా ప్రింట్ చేసే అవకాశం ఉంటుంది. సచివాలయాల్లో ప్రస్తుతం డిజిటల్ కాపీలను మాత్రమే జారీ చేస్తున్నారు. క్యాస్ట్, ఇన్‌కమ్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ వంటి వాటికి ఒక్క కాపీ మాత్రమే మంజూరు చేస్తున్నారు. సచివాలయాల్లో జారీ చేసే డిజిటల్ కాపీలను మీ సేవా కేంద్రాల్లో ప్రింట్ తీసుకోవాలని సిబ్బంది ఉచిత సలహాలు ఇస్తున్నారు. పీడీఎఫ్ కాపీలకు ఎవరైనా నకిలీ పత్రాలను సృష్టిస్తే తాము చిక్కుల్లో పడతామని, సచివాలయాలు జారీ చేసే పత్రాలను ముద్రించడానికి మీ సేవా కేంద్రాలు నిరాకరిస్తున్నాయి. సచివాలయాలు, మీ సేవా కేంద్రాల మధ్య నెలకొన్న గందరగోళంతో అర్జీదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, యువగళం పాదయాత్రలో లోకేశ్ గత ఎన్నికలకు ముందు కలిసిన ఆపరేటర్లకు మీ సేవలను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. ఈ పరిస్థితుల్లో మీసేవలపై పట్టున్న ముఖ్యమంత్రి చంద్రబాబు వాటికి పూర్వవైభవం తెస్తారని భావిస్తున్నారు.

అన్ని వేళాలా అందుబాట్లో సేవలు

మీ సేవా కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల సేవలు అందుబాటులో ఉండేవి. ఇవి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారాయి. ఉదయం నుంచి రాత్రి వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మీ సేవా కేంద్రాలు నిర్విరామంగా పని చేస్తుండేవి. దీంతో వివిధ రకాల సర్టిఫికెట్లు, పన్నులు, వివిధ రకాల బిల్లుల చెల్లింపులకు ఈ కేంద్రాలు ప్రజలకు సౌకర్యంగా ఉండేవి. అనేక ఏళ్లపాటు ప్రజలకు సేవలందించిన మీ సేవలకు వ్యతిరేకంగా వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. సచివాలయాలు ఏర్పడిన తొలినాళ్లలో మీ సేవా కేంద్రాల్లో ఇచ్చిన సర్టిఫికెట్లు చెల్లవని, అధికారులు కూడా సచివాలయాలను ప్రోత్సహిస్తూ వచ్చారు. అప్పటి ప్రభుత్వం కూడా మీసేవా కేంద్రాలను పరిగణనలోకి తీసుకోరాదని హెచ్చరించడంతో అధికారులు కూడా మీసేవలను దూరం పెట్టారు. దీంతో మీ సేవలకు ప్రజలు కూడా దూరమయ్యారు. ఈ క్రమంలో మీసేవా కేంద్రాల పరిస్థితి దయనీయంగా మారింది. ఆర్థిక ఇక్కట్లతో కొందరు కేంద్రాలను నడపలేక మూసివేశారు. సచివాలయాలలో సేవలు ఉన్నా అవి ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకే అందుబాటులో ఉంటాయి. ఈ కారణంగా వివిధ పనులు, ఉద్యోగాలకు వెళ్లే వారికి ఆశించిన విధంగా సచివాలయాల సేవలు ఉపయోగపడడం లేదనే విమర్శలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలు అందించడం లేదనే ఆరోపణలున్నాయి.

- ఆదరణ కోల్పోతున్న కేంద్రాలు

పౌర సేవల్లో అంతులేని నిర్లక్ష్యం

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రతిష్ఠాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారు. సుపరిపాలన నినాదంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసినా పౌర సేవల్లో అంతులేని నిర్లక్ష్యం ఉంది. సచివాలయాల సిబ్బందిలో జవాబుదారీతనం తీసుకురాకుండానే ఐదేళ్లు గడిచిపోయాయి. దశల వారీగా 500కుపైగా పౌరసేవల్ని సచివాలయాల్లో అందిస్తామని ప్రకటించిన గత ప్రభుత్వం అమలులో చతికిల పడింది. రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాలు, విద్యుత్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ వంటి సేవల్ని అందిస్తామన్నా ఆయా శాఖల నుంచి అధికారాలను మాత్రం సచివాలయాలకు బదలాయించలేదు. సాంకేతికంగా చెప్పాలంటే సచివాలయ సిబ్బందికి ఎలాంటి అధికారాలు లేవు. కేవలం దరఖాస్తుల్ని ప్రాసెస్ చేయడానికి మాత్రమే వారు పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వంలో ఇంటింటికి పెన్షన్ల పంపిణీకే సిబ్బంది పరిమితమయ్యారన్న వాదన ఉంది.

బోరుగడ్డకు రాచమర్యాదలపై కొనసాగుతున్న దర్యాప్తు


- మరో కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ కుమార్‌కు అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో రాచమర్యాదలు చేసిన ఘటనపై పోలీసుల దర్యాప్తు కొనసాగుతుంది. కస్టడీలో ఉన్న బోరుగడ్డకు రాచమర్యాదలు కల్పించిన వ్యవహారంపై ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు విచారణ జరిపి ఎస్పీ సతీష్ కుమార్‌కు నివేదిక అందించారు. పోలీస్ స్టేషన్లో సీసీ కెమెరా ఫుటేజీ లీకేజీ వ్యవహారంపై జిల్లా అడ్మిన్ అదనపు ఎస్పీ రమణమూర్తి విచారణ జరిపి జిల్లా ఎస్పీకి నివేదిక అందజేశారు. అరండల్‌పేట స్టేషన్‌లో రాచమర్యాదలు కల్పించిన వ్యవహారంపై ఇప్పటికే నలుగురు కానిస్టేబుళ్లపైనా, రెస్టారెంట్‌కు తీసుకువెళ్లిన వ్యవహారంలో ఏడుగురిపైనా వెరసి 11 మందిపై సస్పెన్షన్ వేటు విధించిన విషయం తెలిసిందే. సీసీ కెమెరా ఫుటేజీ లీకేజీ కేసులో ప్రైవేటు టెక్నీషియన్ శేషును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించారు. ఇదే కేసులో ఓ పత్రికా విలేకరి, మరో చానల్ కెమెరామన్ కూడా నిందితులుగా ఉన్నారు. విలేకరి అజ్ఞాతంలో ఉండగా, కెమెరామన్‌కు నోటీసు జారీ చేశారు. ఈ కేసులో అదనపు ఎస్పీ రమణమూర్తి జరిపిన దర్యాప్తులో ఓ కానిస్టేబుల్ పాత్ర ఉన్నట్లు నిర్ధారించారు. ఆ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు విధించే అవకాశం ఉంది. ఈ వ్యవహారంలో పోలీసు అధికారుల నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. సంబంధిత డీఎస్పీ, సీఐలకు ఛార్జిమెమోలు ఇచ్చే అవకాశం ఉంది.

డేటా లీకేజీపై కలవరం..

అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ప్రైవేటు టెక్నీషియన్ శేషు డేటా చౌర్యానికి పాల్పడినట్లు వెలుగు చూడడంతో అనేక మందిలో ప్రస్తుతం కలవరం మొదలైంది. ఆయన అనేక పోలీస్ స్టేషన్‌లతో పాటు కార్యాలయాలు, పలువురు ఇళ్లలో సీసీ కెమెరాలు అమర్చారు. ఆయా కెమెరాలకు సంబంధించిన పాస్‌వర్డ్ సంబంధిత వ్యక్తులకు ఇవ్వడంతోపాటు తన వద్ద ఉంచుకుని యాక్సెస్ చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. తద్వారా ఎవరెవరి వీడియోలు చూశాడనేది ప్రస్తుతం వారిలో ఆందోళన కలిగిస్తుంది. ఆయా వీడియోల ఆధారంగా బ్లాక్ మెయిల్ చేసి డబ్బు గుంజినట్లు సమాచారం. డేటా చౌర్యానికి సంబంధించి మొత్తం వ్యవహారంపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగు చూసినట్లు సమాచారం.

నేటి నుంచి అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు


సమావేశంలో మాట్లాడుతున్న డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ జి.కరుణసాగర్

బాపట్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 2024-2025 వార్షిక రెండో దశ అంతర్ కళాశాలల క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు ఈనెల 17వ తేదీ నుంచి బాపట్ల వ్యవసాయ కళాశాలలో ప్రారంభం కానున్నట్లు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ ఆఫ్ స్టూడెంట్ ఎఫైర్స్ డాక్టర్ జి.కరుణసాగర్ తెలిపారు. ఈ విషయమై కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనా రాణితో కలిసి ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న వ్యవసాయ విశ్వ విద్యాలయానికి చెందిన 19 అనుబంధ కళాశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారన్నారు. 20వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు 612 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. విద్యార్థినీలకు ప్రత్యేకంగా క్రీడాపోటీలు జరుగుతాయని వివరించారు. 17వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలకు విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రసూనా రాణి తెలిపారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎస్.జవహర్ పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ ఎం.సురేష్‌కుమార్, డాక్టర్ ఎం.రమాదేవి, డాక్టర్ టి.ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114, 122, 133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

నీటి సంఘాల ఎన్నికల సందడి

సాగు నీటి సంఘాల ఎన్నికలను ఈనెలలో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో సత్తెనపల్లి నియోజక వర్గంలో నీటి సంఘాల ఎన్నికల కోలాహలం నెలకొంది. నియోజక వర్గంలో నీటి సంఘాలన్నింటినీ టీడీపీ కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో నియోజక వర్గంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి గ్రామ స్థాయిలో పకడ్బందీగా కృషి చేస్తున్నారు.

- ఇప్పటికే ఓటర్ల జాబితాలు సిద్ధం
- 18న తుది జాబితా, 20న నోటిఫికేషన్
- మండల పరిధిలో మొత్తం 154 టీసీలు


ఎన్ఎస్‌పీ కాలువ

సత్తెనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : 2015లో గతంలో ఎన్నికలు నిర్వహించగా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఆ సంఘాల అధ్యక్షులను, సభ్యులను బలవంతంగా తమ వైపు తిప్పుకొంది. నీటి సంఘాలకు అధ్యక్షులు లేని వాటికి నీటి పారుదల డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరును సంఘ అధ్యక్షుడిగా వ్యవహరించాలని ఆదేశాలు జారీచేసింది. 2019 నుంచి అనధికారికంగా వైసీపీ సభ్యులే ఆయా నీటి సంఘాలను నిర్వహిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సాగు నీటి సంఘాలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహిండానికి పూనుకుంది. క్షేత్ర స్థాయిలో నీటి సంఘాలకు రైతుల్లో మంచి గుర్తింపు ఉండటంతో అధికార పార్టీలోని గ్రామ, మండల స్థాయి నాయకులు ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించారు. సాగు నీటి వినియోగదారుల సంఘాల సభ్యులు 10 మంది డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం చిన్న నీటిసంఘాల పరిధిలో ఆరు టీసీలు, పెద్ద నీటి సంఘాల పరిధిలో 12 టీసీ (టెరిటోరియల్ కాన్సిస్టెన్సీ)లు ఉంటాయి. రైతులు టీసీ సభ్యులను ఎన్నుకుంటారు. అలా ఎన్నికైన టీసీ సభ్యుల్లో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. మేజరు ఇరిగేషన్‌లో ఉన్న చైర్మన్‌ల నుంచి సంబంధిత ప్రాంత టీసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ులను ఎన్నుకుంటారు.

ఇప్పటికే నీటి సంఘాలకు సంబంధించిన ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల నిర్వాహణకు అధికారులను నియమించారు. ఎన్నికల నిర్వాహణకు సంబంధించి సంబంధిత అధికారులకు శిక్షణ నిర్వహించారు. సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలో సవరణలు ఉంటే అప్పీలు చేసుకోనేందుకు అవకాశం కల్పించారు. ఈనెల 18న తుది జాబితాను ప్రకటించి 20న ఎన్నికల నిర్వాహణకు నోటిఫికేషన్ వెలువడనుంది. నోటిఫికేషన్ గడువు సమీపిస్తుండటంతో చైర్మన్‌ల పదవుల కోసం గ్రామ, మండల స్థాయి టీడీపీ నేతలు పోటీ పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో జరిగే మొదటి ఎన్నికలు కావటంతో ఆ పార్టీ నేతలు ఈ ఎన్నికలను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నారు.

సత్తెనపల్లి మండలం అబ్బూరు పరిధిలో 2 సంఘాలు, భట్లూరు పరిధిలో ఒకటి, భీమవరం పరిధిలో 2, భృగుబండ పరిధిలో 5, ధూళ్ళిపాళ్ళ పరిధిలో 2, గోరంట్ల పరిధిలో 3, గుడిపూడి పరిధిలో 4, కంకణపల్లి పరిధిలో 3, కంటెపూడి పరిధిలో ఒకటి, కట్టమూరు పరిధిలో 2, కొమెరపూడి పరిధిలో ఒకటి, ఎల్ గార్లపాడు పరిధిలో 2, నందిగామ పరిధిలో3, పాకాలపాడు పరిధిలో 4, పెదమక్కెన పరిధిలో 3, ఫణిదం పరిధిలో 4, రెంటపాళ్ళ పరిధిలో ఒకటి, సత్తెనపల్లి పరిధిలో 2 సంఘాలు, వడ్డవల్లి పరిధిలో 3 సంఘాలు ఉన్నాయి. మొత్తం 154 టీసీలు ఉన్నాయి. ఈ నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.98 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 10,400 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు పవర్ జనరేషన్ ద్వారా విడుదల చేస్తున్నారు.

జోన్ డైరీ

- రెంటచింతల మండలంలోని గోలి గ్రామంలో అయ్యప్ప ఆలయనిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడానికి ఆదివారం ముగ్గురు ఎమ్మెల్యేలు రానున్నారు. మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, యరపతినేని శ్రీనివాసరావు, తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ ఎమ్మెల్యే బీ.లక్ష్మారెడ్డిలు ఈకార్యక్రమంలో పాల్గొంటారని ఆయా పార్టీల నేతలు తెలిపారు.
- మాచవరం మండలంలోని మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రానున్నారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.
- మాచర్ల పట్టణంలోని సెరిన్ కాలనీ, అక్బర్ కాలనీ సచివాలయాల్లో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వేణుబాబు తెలిపారు.

19 నుంచి ఆధార్ క్యాంపులు

మాచవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాచవరం మండల పరిధిలో ఈనెల 19 నుంచి 29వరకు ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పీ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19 నుంచి 28 వరకు మాచవరం జడ్పీహైస్కూలు, 22 నుంచి 28 వరకు గంగిరెడ్డిపాలెం, 19 నుంచి 28 వరకు మోర్జంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్, 25 నుంచి 28 వరకు ఆకురాజుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆధార్ అప్‌డేట్, ఇతర సమస్యలు ఉన్నవారు ఆయా కేంద్రాలకు వెళ్ళి పరిష్కరించు కోవాలని ఎంపీడీవో సూచించారు.

ఆలయంలో అన్నదానం

మాచర్ల రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్‌లో గల శ్రీసీతారామాలయంలో శనివారం రిక్కల రామకృష్ణ కుటుంబ సభ్యుల సహకారంతో 200 మంది పేదలకు అన్నదానం చేసినట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు. అన్నదాన కార్యక్రమానికి ఆర్థికసాయం అందించే దాతలు ఆలయ కమిటి సభ్యులను సంప్రదించాలని వారు సూచించారు.

19న జాబ్‌మేళా

మాచర్లటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యాన ఈనెల 19న పట్టణంలోని ఎస్‌కేబీఆర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో హెటిరో డ్రగ్స్, ఐసీఐసీఐ బ్యాంకు, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ కెఎల్ టెక్నికల్ సర్వీసెస్ తదితర కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, ఫార్మసీ, పీజీ విద్యనభ్యసించి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు గల వారు అర్హులన్నారు. రెజ్యూమ్, ఎడ్యుకేషన్ సరిఫికెట్ జిరాక్స్, ఆధార్ నకలు, పాస్‌పోర్టు సైజు ఫోటోతో ఇంట ర్వ్యూకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 7842747682, 9492158153 లను సంప్రదించాలన్నారు.

సదాకు టీడీపీ శాశ్వత సభ్యత్వం

క్రోసూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు మండలం 88 తాళ్ళూరుకు చెందిన నాలజాల సదాశివరావు టీడీపీ శాశ్వత సభ్యత్వాన్ని తీసుకున్నారు. రూ. లక్ష చెల్లించి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేతుల మీదుగా ఆయన శాశ్వత సభ్యత్వాన్ని పొందారు. సదాశివరావు ప్రస్తుతం జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు.

పొలం ధ్వంసం కేసులో
నిందితుడు అరెస్టు

సత్తెనపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అమరావతి మండలం ఉంగుటూరులో దార్ల ఈరబాబుకు చెందిన పత్తి పొలాన్ని ట్రాక్టరుతో దున్ని ధ్వంసం చేసిన కేసులో నిందితుడైన పీ శేషగిరిరావును శనివారం అరెస్టు చేసినట్టు సత్తెనపల్లి డీఎస్పీ ఎం హనుమంతరావు విలేకరులకు తెలిపారు. పట్టణ పోలీసు స్టేషన్ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిందితుడిని కోర్టుకు హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించారన్నారు.

బాలల హక్కుల వారోత్సవాలు

మాచవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా స్థానిక లయోల ప్రేమ నివాసంలోని విద్యార్థినీ విద్యార్థులకు శనివారం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పల్నాడు జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి బీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ బాలల హక్కులను ప్రతి ఒక్కరు పరిరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిస్టర్ కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకట లక్ష్మి, అన్నపూర్ణ, కోటేశ్వరి, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం ప్రారంభం

రెంటచింతల,నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని శివాలయం అయ్యప్ప కళ్యాణ మండపంలో వరుసగా 20వ సంవత్సరం అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. వివిధ రకాల మాలలు ధరించి వారు ఎవరైనా అన్నదానంలో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

అక్రమంగా మైనింగ్ చేస్తే క్రిమినల్ కేసులు

- తహసీల్దారు కే.పుల్లారావు


త్రిపురాపురం కొండపై మైనింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్న నకరికల్లు రెవెన్యూ అధికారులు

నకరికల్లు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా మైనింగ్ చేస్తే క్రిమినల్ కేసులను నమోదు చేస్తామని తహసీల్దార్ కే పుల్లారావు హెచ్చరికలు జారీ చేశారు. శనివారం నకరికల్లు మండలం త్రిపురాపురం కొండ పై ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి మైనింగ్ జరుగుతున్నట్టు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందాయి. సీనియర్ అసిస్టెంట్ రాజగోపాల రెడ్డి, ఇన్‌చార్జి ఆర్‌ఐ పురుషోత్తం, వీఆర్‌వో మౌలాలి, మైనింగ్ జరుగుతున్న ప్రాంతానికి వెళ్ళి ఎక్స్‌వేటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ భూముల్లో, అటవీ భూముల్లో అనుమతులు లేకుండా మైనింగ్ జరిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కే పుల్లారావు హెచ్చరికలు జారీచేశారు.మూడు రోజులుగా త్రిపురాపురం కొండపై అక్రమార్కులు మైనింగ్ జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా కొండ మట్టిని తవ్వి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం పై తహసీల్దార్ పుల్లారావు మైనింగ్ శాఖ అధికారులకు, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.


కొండ వద్ద సర్వే చేస్తున్న మైనింగ్ అధికారులు

గ్రావెల్ తవ్వకాలపై సర్వే

మాచర్లటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి దినపత్రికలో గత గురువారం 'కొండను మింగేశాడు'అనే కథనం ప్రచురితంకాగా, గ్రావెల్ తవ్వకాలపై మైనింగ్‌శాఖ శనివారం సర్వే ప్రారంభించింది. కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకాపురం వెళ్లే రహదారి పక్కన సర్వే నంబరు 67/5బీలో గ్రావెల్ కోసం కొండను తవ్వగా దాచేపల్లి మైన్స్, జియాలజీ అధికారి ప్రకాష్‌కుమార్ ఆదేశాలమేరకు అసిస్టెంట్ జియాలజిస్ట్ జే.సుధాకర్, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్, సర్వేయర్ జయప్రకాష్, ఏవో ఖాజావలి సర్వేచేపట్టారు. సర్వే అనంతరం మూడు రోజుల్లో పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని సర్వే అధికారులు తెలిపారు.

ముగిసిన శిక్షణ

సత్తెనపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపైస్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్లో ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణా కార్యక్రమం శనివారం ముగిసింది. సంపూర్ణ గ్రామ అభివృద్ధి ప్రణాళిక రచనపై 12 గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, వెలుగు వీవోఏలకు అవగాహన కల్పించినట్టు ఎంపీడీవో బీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఏ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యద్వారానే ఉన్నత స్థాయికి

సత్తెనపల్లి రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : విద్య ద్వారానే బాలికలు ఉన్నత స్థాయికి ఎదుగుతారని హెచ్‌ఎం ఉమాదేవి అన్నారు. మండలంలోని కంటెపూడి ఎంపీపీ పాఠశాలలో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు. విద్యార్థుల హక్కులు, బాల్య వివాహాల వల్లకలిగే అనర్థాలను హెచ్‌ఎం ఉమాదేవి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సెంటర్ కో-ఆర్డినేటర్ మేడే వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి

రాజుపాలెం, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ పిలుపునిచ్చారు. రాజుపాలెం గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యానారాయణ మాట్లాడుతూ గ్రామాలలో ఏమైనా సమస్యలు ఉంటే సంబందింత అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కరం అయ్యే విధంగా కృషి చేస్తారని చెప్పారు. తొలుత అన్ని శాఖలకు చెందిన అధికారులు వారి వారి శాఖలలో జరుగుతున్న అభివృద్ధిని సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా పలువురు సర్పంచ్‌లు తమ గ్రామాలలో నీటి సమస్య ఉందని పరిష్కారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజేశ్వరి, తహసీల్దార్ దుర్గేశ్వరరావు, అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల్లో తనిఖీలు

క్రోసూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మూడు మండలాల్లోని 10 మద్యం షాపుల్లో శనివారం తనిఖీలు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ టీ.తులసీ తెలిపారు. సమయ వేళలు, ఎంఆర్‌పీ ధరలకు విక్రయం, ధరల పట్టికలు, స్టాక్ బోర్డుల ఏర్పాటు వంటివాటిని తనిఖీ చేసినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని మద్యంషాపు నిర్వాహకులను హెచ్చరించినట్టు తెలిపారు. ఆవులవారిపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షేక్ సర్దార్ సాహెబ్ అనే వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. తనిఖీల్లో సీఐతో పాటు ఆయా మండలాల ఎక్సైజ్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు మృతి

క్రోసూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు కూరాకుల శ్రీనివాసరావు (58) శనివారం మృతి చెందారు. ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘ నేతగా, క్రోసూరు మండల విద్యా వనరుల కేంద్రంలో ఎంఆర్‌పీగా ఆయన అందరికీ సుపరిచితులు. ఆయన ప్రస్తుతం దొడ్లేరు ఎంపీయూపీ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఎస్టీయూ నేతలు, క్రోసూరు, మేడికొండూరు ఎంఈవోలు, ఉపాధ్యాయులు నాగవరం గ్రామంలోని శ్రీనివాసరావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు 1400 దరఖాస్తులు

ముప్పాళ్ళ నవంబరు 16: ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఇప్పటి వరకూ 1400 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలిస్తున్నామని తహసీల్దారు ఎం.భవాణీశంకర్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబందించి రాజకీయ పార్టీల నాయకులతో శనివారం తహసీల్దార్ కార్యాలయంలో తసీల్దారు సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, వైసీసీ నేతలు ఎంజేఎం రామలింగారెడ్డి, సీపీఎం నేతల తొరటి అమరలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యం

నకరికల్లు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రానున్న రోజుల్లో సహకార సంఘాలు మరింత బలోపేతమౌతాంయని, ఉద్యోగ కల్పనకు సహకార రంగం అధిక ప్రాధాన్యం ఇస్తుందని సబ్ డివిజనల్ కో-ఆపరేటీవ్ అధికారి స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. 71వ సహకార వారోత్సవాల్లో భాగంగా శనివారం నకరికల్లు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతిసంఘం కార్యాలయ ఆవరణలో సహకార పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సహకార సంఘాల ప్రయోజనాల గురించి ఆయన వివరించారు. అలాగే సహకార సంఘ పర్సన్ ఇన్‌చార్జి వై.మహేష్‌కుమార్ సహకారసూత్రాల గురించి తెలిపారు. కార్యక్రమంలో నకరికల్లు పీఏసీఎస్ సీఈవో కోళ్ళపూడి శ్రీనివాసరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

దుర్గి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన దుర్గిలోని కస్తూర్భాగాంధీ పాఠశాలలో విద్యార్థినులకు శనివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతా శంకర్, ఎంపీటీసీ శెట్టిపల్లి యలమంద, పీహెచ్‌సీ వైద్యాధికారి సైదులు, ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి,(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల్ స్వస్థ కార్యక్రమంలో భాగంగా శనివారం 16వ వార్డులో చైల్డ్ హెల్త్ క్లీనింగ్ కార్యక్రమాన్ని మునిసిపల్ కమిషనర్ షమ్మి ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లల్లోని పిల్లలకు వైద్యులు ధర్మసింగ్‌శాస్త్రి ఆసియాలు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి హెల్త్ కార్డులను పంపిణీచేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎం అంజనీదేవి, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

- రూ. 85,955ల రికవరీకి ఆదేశాలు

మాచర్లరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా డ్వామా పీడీ సిద్ధ లింగయ్య ఆధ్వర్యాన ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి మండలపరిధిలో రూ.19,84,45,192 విలువైన పనులు జరగగా రూ.85,955ల అవినీతి జరిగినట్లు గుర్తించి రికవరీకి ఆదేశించారు. కొన్నిచోట్ల చనిపోయిన వారికి కూడా నగదు చెల్లించినట్లు గుర్తించారు. పని ప్రదేశాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయకపోవడం, ఒకే కుటుంబంలో ఇద్దరికి జాబ్‌కార్డులు వంటివాటిని గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫణికుమార్‌నాయక్, ఏపీవో విజయకుమారి, ఎస్‌ఆర్‌పీ రాజు, ఏపీడీ మల్లికార్జునరావు, ఐటీడీఏ స్పెషలాఫీసర్ రాజు, ఏపీవో నాగశ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు అవార్డులు

మాచర్లటౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ నేతలు మాచర్ల, దుర్గి, వెల్దుర్తి మండలాల్లోని ప్రభుత్వోన్నత పాఠశాలలో పనిచేస్తున్న 25 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసి వారికి శనివారం నేషన్ బిల్డర్ అవార్డులు అందించారు. కార్యక్రమంలో సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సూర్యప్రసాదరావు, కేసీపీ జీఎం వెంకటరమణ, రోటరీ డిప్యూటీ గవర్నర్ రామకోటయ్య అధ్యక్షురాలు కొండవీటి కృష్ణకుమారి, కార్యదర్శి నిమ్మగడ్డ సురేఖ, ట్రెజరర్ అన్నపురెడ్డి లక్ష్మి, చెరుకూరి నరసింహారావు, సత్యప్రసాద్, ఆలేటి కోటేశ్వరరావు, నాగూర్‌వలి, రామ్మూర్తి, దశరథ్, పందిరి నరసింహారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

పెదకూరపాడు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పెదకూరపాడు సర్పంచ్ గుడిపూడి రాజు, కన్నెగండ్ల సర్పంచ్ కోరంపల్లి వెంకట్రామయ్యలు ఆయా గ్రామాల్లోని సదుపాయాల కల్పన, రైతుల సమస్యలను ప్రస్తావించారు. సమావేశంలో తహసీల్దార్ మీసాల డానియేలు, ఎంపీడీవో రామృష్ణ, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోండి

- ప్రజాకవి దర్శి శేషారావు
- వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న వారోత్సవాలు



పెదకూరపాడులో చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పెదకూరపాడు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): ప్రజలు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాకవి దర్శి శేషారావు అన్నారు. పెదకూరపాడులోని శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య, జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు చిత్రలేఖనంపోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక శాఖా గ్రంథాలయ అధికారిణి కొర్రపాటి వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుర్గి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన దుర్గి గ్రంథాలయంలో 'గ్రంథాలయ ఆవశ్యకత, సమాజంపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశాలపై చర్చావేదిక నిర్వహించారు. ఈపోటీల్లో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, షేక్ అబ్బాస్, గ్రంథాలయ అధికారులు వేణుగోపి, మెర్సీ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయ శాఖ అధికారి వాణి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రోసూరు (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రం థాలయ అధికారి వీరాంజమ్మ పాల్గొన్నారు.

రాజుపాలెం, (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ దుర్గేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన రఘు రామకృష్ణ రాజును శనివారం అసెంబ్లీ ప్రాంగణంలో సత్తెన పల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు. - **సత్తెనపల్లి**

అమరావతిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలి : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



పెదకూరపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు నియోజక వర్గంలోని అమరావతిని ప్రపంచ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో నియోజక వర్గ సమస్యలపై జీరో అవర్‌లో భాష్యం ప్రవీణ్ మాట్లాడారు. ప్రసిద్ధ అమరలింగేశ్వరస్వామి కొలువైవున్న, బౌద్ధరామంగా, ఉత్తర కృష్ణ ప్రవాహినిగా పేరొందిన అమరావతి ప్రాంతం రాజధాని అమరావతి కేంద్రంగా ఉందని, ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశాలతో మినీ మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేశామన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు అమరావతి ప్రాంతాన్ని సందర్శించాలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని 40 గ్రామాలకు ఎత్తిపోతల పథకాలద్వారా తాగుసాగు నీటిని అందించాలని, ప్రధాన రహదారుల పునరుద్దరణకు నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే ప్రవీణ్ కోరారు.

రహదారులకు నిధులు మంజూరు

పిడుగురాళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గుంతలు లేని రహదారులే లక్ష్యంగా నూతన రోడ్ల ఏర్పాటుకు నాబార్డు నిధులు రూ.85 లక్షలు మంజూరు చేసింది. గురజాల నియోజకవర్గ పరిధిలో గురజాల, ఓబులేశునిపల్లె, మాడుగుల వరకు 8 కిలోమీటర్లు, గురజాల నుండి గొట్టిముక్కల మీదుగా సమాధానంపేట, వరకు 6.33 కిలోమీటర్లు కలిపి 25 లక్షలు, గురజాల నుండి సమాధానంపేట వరకు 3.72 కిలోమీటర్లు వరకు 60 లక్షలు నాబార్డు నిధులను మంజూరు చేసినట్లు ఆర్అండ్‌బీ ఏఈ యూసుఫ్ తెలిపారు.

సీనియర్ సిటిజన్లకు చార్జీలో రాయితీ

రెంటచింతల,నవంబరు 16 (అంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులో ప్రయాణించే సీనియర్ సిటిజన్లకు ప్రయాణ చార్జీలో ఆర్టీసీ రాయితీ కల్పించిందని మాచర్ల ఆర్టీసీ డిపో మేనేజర్ బత్తుల వీరస్వామి తెలిపారు. శనివారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ళు దాటిన వారు వారి స్వస్థలం నుంచి బస్సుల్లో ప్రయాణించే సమయంలో టికెట్ ధరలో 25 శాతం తగ్గింపు ఉంటుందని తెలిపారు. ప్రయాణ సమయంలో ఆధార్, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డు, పాన్‌కార్డు, ఓటరు ఐడీ కార్డు, పాస్‌పోర్టు, రేషన్ కార్డుల్లో ఏదైనా ఒకటి కండక్టరుకి చూపించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

అరుదైన నేత రామ్మూర్తినాయుడు

పిడుగురాళ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయాలలో అరుదైన నేత మాజీ ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు అని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. 1994లో రామ్మూర్తినాయుడు విజయం చంద్రగిరి అభివృద్ధితో నాంది పలికిందని, వెనుకబాటు, హింసకు కేంద్రంగా వున్నచోట మౌలిక వసతుల అభివృద్ధికి రామ్మూర్తినాయుడు ఎంతో కృషి చేశారని, రాజకీయాలలో స్వల్ప వ్యవధిలోనే ప్రత్యేకత చాటుకున్న వ్యక్తి రామ్మూర్తినాయుడు అన్నారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే యరపతినేని సంతాపం వ్యక్తం చేశారు.

కళ్ల ముందు జరిగినవే... కథలుగా!


హకీం జాని రచించిన బాలసాహితీ పుస్తకాలు

ఆయన కలం చేతబట్టారంటే కథలు జాలు వారాల్సిందే. కళ్ల ముందు జరిగిన సామాజిక అంశాలను ఇతివృత్తంగా చేసుకుని ఎన్నెన్నో కథలు రచించారు. పిల్లలకు అర్థమయ్యేరీతిలో పద ప్రయోగాన్ని సంధించి పుస్తకాలను అచ్చు వేయించి పంచి పెడుతున్నారు. తెలుగు భాషలోకి ఆంగ్ల పదాలు చొచ్చుకొస్తున్న ప్రస్తుత తరుణంలో సరళమైన పదాలతో కథలు రచించి పిల్లల్లో మాతృ భాషపై మమకారం పెంచేందుకు కృషి చేస్తున్నారు. విద్యార్థి దశలో నాటకాల రచయిత, కళాకారుడిగా, ఆ తర్వాత బాలసాహితీవేత్తగా, నేడు కథల పుస్తకాలకు రచయితగా వ్యవహరిస్తున్న ఆయనే తెనాలి నందులపేటకు చెందిన షేక్ హకీం జాని.

గుంటూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరుగురు తోబుట్టువులు ఉన్న కుటుంబంలో హకీం జాని ఒక్కరే మగ సంతానం. ఆయన తండ్రి ఫరీద్ సాహెబ్ తెనాలి మున్సిపాల్టీలో చిరుద్యోగం చేసి రిటైర్డ్ అయ్యారు. తల్లి మహబూబ్‌బీ గృహిణి. పదో తరగతి వరకు మున్సిపల్ స్కూల్‌లో చదువుకున్న హకీం జాని ఇంటర్, డిగ్రీ తెనాలి వీఎస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాలలో పూర్తి చేశారు. బీఈడీని మహబూబ్‌నగర్‌లో పూర్తి చేశారు.


షేక్ హకీం జాని

కాగా 8వ తరగతి చదువుతున్న రోజుల్లో అప్పట్లో కళలకు కాణాచి అయిన తెనాలిలో ప్రతి పాఠశాలలో నాటక ప్రదర్శనలు జరిగేవి. తనకు కూడా ఒక పాత్ర ఇప్పించమని పాఠశాలలో తనకంటే పై తరగతులు చదువుతున్న విద్యార్థులను అభ్యర్థించగా వారు కాదన్నారు. ఆ కసితో అప్పటికప్పుడు మూడు కథలు రాసి స్కాట్ టీచర్ మద్ది కోటేశ్వరరావుకు అందజేశారు. ఆయన వాటిని చూసి ఆశ్చర్యపోయి 'కన్నందుకు శిక్ష' అనే నాటకాన్ని ప్రదర్శించేందుకు అనుమతించారు. అందులో కీలక పాత్రని హకీం జానీకే ఇచ్చారు. అయితే భారీ వర్షం కారణంగా ఆ ప్రదర్శన రద్దు అయింది. కొన్నాళ్లకు తెనాలిలోనే ఒక ప్రైవేటు పాఠశాల వార్షికోత్సవంలో నాటకాల ప్రదర్శన జరుగుతుంటే తమకు కూడా అవకాశం కల్పించమని కోరగా చివరి నాటకంగా ఛాన్స్ ఇచ్చారు. దానిని ఆయన సద్వినియోగం చేసుకున్నారు. అది మొదలుకొని శ్రీకృష్ణదేవరాయలుగా 14 సార్లు 60 మంది విద్యార్థులతో కలిసి నటించి మన్ననలు పొందారు. అల్లూరి సీతారామరాజుగానూ పాత్రకు జీవం పోశారు. జీవనోపాధి కోసం ఆయన తెనాలిలోని మాంటిస్సోరి, వివేక, సెయింట్ జాన్స్ స్కూళ్లలో పని చేశారు.

71 పుస్తకాలు రచన...

1991లో రచనపై ఆయనకు మక్కువ కలిగింది. దాంతో అప్పట్లో పత్రికల్లో ఉత్తరాల శీర్షిక అని ఒకటి ప్రచురితమయ్యేది. దేశంలో జరుగుతున్న పరిణామాలపై పాఠకులు స్పందనని అందులో పొందుపరిచేవారు. దీనిని హకీం జాని సద్వినియోగం చేసుకొని ఏడాది పాటు ఏ రోజుకు ఆ రోజు జరిగిన పరిణామాలపై ఉత్తరాలు రాశారు. ఆ తర్వాత మా ఊరు - మా గొప్ప శీర్షికతో తెనాలి ప్రత్యేకతని వివరిస్తూ రాసిన కథనానికి మంచి గుర్తింపు వచ్చింది. సూపర్‌స్టార్ కృష్ణ, విజయనిర్మల, దాసరి నారాయణరావు, బ్రహ్మానందం, ఎస్‌వీ కృష్ణారెడ్డి, రావూరి భరద్వాజ, సుమన్ వంటి ఎందరో ప్రముఖుల ఇంటర్వ్యూలు చేశారు. 2023 నాటికి 71 పుస్తకాలు రచించారు. ఆయన రచనలు హైదరాబాద్, విజయవాడ పుస్తక ప్రదర్శనలతోపాటు తెలుగు రాష్ట్రాలలోని గ్రంథాలయాలు, అమెజాన్ ఈ-కామర్స్‌లోనూ స్థానం పొందాయి.

నీతి కథలు.. బాల సాహితి పుస్తకాలు

బాలసాహిత్యంపై రచనలు చేయాలని బాల బంధు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య సూచనలతో హకీం జాని రచనలు ప్రారంభించారు. చిన్నారులకు అర్థమయ్యేలా సరళమైన భాష, పొందికైన పదాలతో వాక్య నిర్మాణం చేసి 36 బాల సాహితి పుస్తకాలను రచించారు. మన వీర వనితలు, అంబేడ్కర్ జీవిత చరిత్ర, బాధ్యతాయుత పౌరుడు, కొత్త వెలుగు, వికటకవి, అమ్మఒడి వంటి పేర్లతో పుస్తకాలను అచ్చు వేయించారు. ఎక్కువగా సామాజిక అంశాలు, నీతి కథలకే ప్రాధాన్యం ఇచ్చారు. అంతేకాకుండా 270కి పైగా నీతి కథలు పిల్లల కోసం రచించినవి వివిధ పత్రికల్లో, ఆదివారం అనుబంధాల్లో ప్రచురితమయ్యాయి. మల్లన, బమ్మెర పోతన, మరియా మాంటిస్సోరి వంటి బాలసాహితీ పుస్తకాలకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 75కి పైగా పంచతంత్ర, 82 తెనాలి రామకృష్ణ, 56 మర్యాదరామన్న, 160 ఈసప్ నీతి, 220 ముల్లా నసీరుద్దీన్ కథలు సేకరించి రచించగా ప్రచురణ కర్తలు అందమైన బొమ్మలతో పిల్లలను ఆకర్షించేలా ముద్రించారు. బాలసాహితీ రంగంలో హకీం జానీ చేసిన కృషికి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇండియన్, ఏషియన్ వరల్డ్ ఫిలిం ఫెస్టివల్‌లోనూ గుర్తింపు తెచ్చి పెట్టాయి. ఎన్టీఆర్ జీవిత చరిత్రపై నాలుగు నెలల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా తమిళనాడులోనూ అధ్యయనం చేసి రచించిన అవతార పురుషుడు పుస్తకం అచ్చయి ఆవిష్కరణ జరిగిన రోజు తన జీవితంలో మరిచిపోలేనిదని హకీం జానీ చెప్పారు. తెనాలిలో రెండు రోజుల పాటు జరిగిన బాపు బొమ్మల ప్రదర్శన సందర్భంలో తన సేవలను గుర్తించి బాపు చేతి నుంచి తన చిత్రం రూపుదిద్దుకోవడం మరిచిపోలేనిదన్నారు.


హకీం జాని నాటక ప్రదర్శన


సీఎం చంద్రబాబు చేతుల మీదగా పురస్కారం అందుకొంటున్న హకీం జాని (ఫైల్)

● ఎన్నో సామాజిక అంశాలకు అక్షర రూపం ● పిల్లలకు తెలుగు భాషపై మమకారం పెంచే ప్రయత్నం ● విద్య, నాటక రంగాల్లోనూ విశిష్ట సేవలు ● ఆంధ్రా ప్యారిస్ బహుముఖ ప్రజ్ఞాశాలి షేక్ అబ్దుల్ హకీం జాని

ప్రజాహక్కుల ఉద్యమాలలో సాయిబాబాది అద్వితీయమైన పాత్ర

-డాక్టర్ కొల్లా రాజమోహన్

బాపట్లనవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా హక్కుల ఉద్యమాలలో ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా పాత్ర అద్వితీయమైనదని నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహన్ పేర్కొన్నారు.


సభలో మాట్లాడుతున్న నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు కొల్లా రాజమోహన్

పట్టణంలో శనివారం సాయిబాబా సంస్మరణ సభ నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ రాజమోహన్ మాట్లాడుతూ చిన్నతనంలోనే పోలియోసోకి రెండుకాళ్ళు చచ్చుబడినా జీవితంలో స్వయం కృషితో, పట్టుదలతో సాయిబాబా ఎదిగారని తెలిపారు. వైకల్యాన్ని లెక్క చేయకుండా విద్యార్థి దశ నుంచే ఉద్యమాలలో మమేకమై ఆదివాసీహక్కుల కోసం పోరాడిన తీరు ఆదర్శవంతమైనదన్నారు. పౌరహక్కుల సంఘం రాష్ట్ర కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రశ్నించేవాళ్ళ నోళ్ళుమూయటానికి తప్పుడు కేసులతో ఉపా చట్టం కింద విచారణ లేకుండా సంవత్సరాల తరబడి జైలులో పెడుతున్నారన్నారు. సాయిబాబా కూడా ఈవిధంగా శిక్ష అనుభవించారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సి.హెచ్. గంగయ్య, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు కల్పన, దేవతోటి వీరాస్వామి, సజ్జా వెంకటేశ్వర్లు, కోట వెంకటేశ్వరరెడ్డి పాల్గొని సాయిబాబా సేవలను కొనియాడారు. ఆయనకు ఘన నివాళులు అర్పించారు.

సర్‌చార్జికి.. సున్నం

గుంటూరు సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ ఆర్థిక పాపాలకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని స్థానిక సంస్థలకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జిల్లా, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు రావాల్సిన సొమ్మును కూడా జగన్ ప్రభుత్వం ఆరగించేసింది. ఫలితంగా గడచిన ఐదేళ్లుగా ఉమ్మడి జిల్లాకు రిజిస్ట్రేషన్, మైనింగ్ శాఖల నుంచి రావాల్సిన బకాయిలు చూస్తుంటే కళ్లు తిరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ శాఖ ప్రతి దస్తావేజుకు మార్కెట్ విలువలో 7.5 శాతాన్ని స్టాంప్ డ్యూటీ రూపేణా వసూలు చేస్తుంది. అందులో 1.5 శాతం సర్‌చార్జి కింద స్థానిక సంస్థలకు చెల్లించాలి. గతంలో నేరుగా ఈ సొమ్ము స్థానిక సంస్థలకు జమయ్యేది. సీఎఫ్ఎంఎస్ (కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టం) ద్వారా చెల్లింపులు మొదలైన తర్వాత మొత్తం సొమ్ము ప్రభుత్వానికి చేరుతుంది. అక్కడ నుంచి వాటాల వారీగా స్థానిక సంస్థల ఖాతాల్లో జమ అవుతుంది. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక సంస్థలకు రావాల్సిన సొమ్మును కూడా రాకుండా చేశారు. గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థలకు రావాల్సిన రూ కోట్లను దారిమళ్లించారు.

బకాయిలపై జడ్పీ చైర్‌పర్సన్ దృష్టి

రిజిస్ట్రేషన్, మైనింగ్ శాఖల నుంచి రావాల్సిన బకాయిల విలువ తేల్చేందుకు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా ఈ మధ్య ఓ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వచ్చిన మూడు జిల్లాల ఆయా శాఖల అధికారులు సమాచారం లేకుండా వచ్చారు. చైర్ పర్సన్ ఆగ్రహంతో తగిన సమాచారంతో మళ్లీ వస్తామని చెప్పి వెళ్లారు. ఈ క్రమంలో గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి బకాయిల వివరాలు సేకరించారు. ఈ ప్రకారం ఒక్క గుంటూరు జిల్లాలోనే గడచిన ఐదేళ్లలో రూ.37 కోట్ల సర్‌చార్జి బకాయి ఉన్నట్టు తేలింది. కొన్ని కార్యాలయాల్లో గత ఐదేళ్లుగా ఒక్క రూపాయి కూడా సర్‌చార్జి కింద జమ కాలేదని తెలుస్తోంది. ఉదాహరణకు అనంతవరం రిజిస్ట్రార్ కార్యాలయంలో 2019 మార్చి నుంచి ఇప్పటివరకు రూ.2,57,36,205 వరకు, తాడికొండ నుంచి రికార్డు స్థాయిలో రూ.9 కోట్లుకుపైగా సర్ చార్జి పెండింగ్‌లో ఉంది. గుంటూరు జిల్లాలోని 18 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి సర్‌చార్జి జమ కాకుండా పెండింగ్‌లో ఉంది. పల్నాడు జిల్లాలో స్టాంప్ డ్యూటీ సర్‌చార్జి సుమారు రూ.13 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. బాపట్ల జిల్లాలో కూడా కోట్లలో బకాయిలు ఉన్నట్లు జడ్పీ వర్గాలు చెబుతున్నాయి.

- దారిమళ్లించిన జగన్ ప్రభుత్వం
- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- స్థానిక సంస్థలకు రిజిస్ట్రేషన్, మైనింగ్ రాయల్టీ పెండింగ్
- ఐదేళ్లలో చెల్లింపులు లేకపోవడంతో అభివృద్ధి పనులకు ఆటంకం

మైనింగ్ రాయల్టీది అదే దారి..

మైనింగ్ రాయల్టీ కింద ఉమ్మడి జిల్లాలోని స్థానిక సంస్థలకు భారీ మొత్తంలో రావాల్సి ఉంది. ఎంత బకాయిలు ఉన్నారో కూడా చెప్పడానికి మైనింగ్ అధికారులు నీళ్లు నములుతున్నారు. ఇంత మొత్తంలో మైనింగ్, రిజిస్ట్రేషన్ శాఖలు స్థానిక సంస్థలకు బకాయిలు పడటం రాష్ట్రం అవతరించిన తర్వాత ఇదే మొదటి సారి అంటున్నారు. ఫలితంగా స్థానిక సంస్థల్లో కనీస అవసరాలు కూడా తీరక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

చాలా ఇబ్బందులు పడ్డాం



గడచిన ఐదేళ్లలో జడ్పీకి రావాల్సిన సర్‌చార్జి, రాయల్టీ సొమ్మును పక్కదారి పట్టింది. అభివృద్ధి పనులకు నిధులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. కనీస అభివృద్ధి కార్యక్రమాలు కూడా చెప్పట్టలేకపోయాం. బకాయిల విడుదలపై ప్రభుత్వ పెద్దలను ఎన్నిసార్లు కలిసినా ఫలితం లేకుండా పోయింది. వైసీపీ పాలనలో స్థానిక సంస్థలకు చాలా ద్రోహం జరిగింది.

- కత్తెర హెనీక్రిస్టీనా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

కాలమ్-6.. సరిదిద్దారు

● అడంగల్ అవస్థలకు చెక్ ● భూ విక్రయాలకు లైన్‌క్లియర్

(5వ పేజీ తరువాయి)

రికార్డుల లోపాలను సరిచేయాలని రెండు నెలల క్రితం సీఎం చంద్రబాబుకు అర్జీ పెట్టారు. ఇదే తరహాలో తెనాలి నుంచి 49 మంది అర్జీలు అందాయి. అయితే సీఎంకు అర్జీ ఇచ్చినా ఖాజాబీ సమస్యకు పరిష్కారం లభించలేదు. దీంతో పదిరోజుల క్రితం కుమారుడు చనిపోయాడని ఖాజాబీ తెనాలి తహసీల్దార్‌ను కలిసి కన్నీరు పెట్టుకుంది. దీనికితోడు సీఎం నుంచి ఈ తరహా అర్జీలపై పరిష్కారానికి ఒత్తిడి రావటంతో దీనిపై తహసీల్దార్ గోపాలకృష్ణ స్పందించారు. అసలు సమస్యపై కసరత్తు చేస్తే, ఒక్క తెనాలి మండలంలోనే 5,808 భూ రికార్డుల్లో లోపాలు జరిగినట్లు గుర్తించారు. అటు నరసరావుపేట సబ్ డివిజన్ పరిధిలోనూ అక్కడి అధికారులు మరో వెయ్యి మంది, గుంటూరు డివిజన్ పరిధిలో మరో 1600 రైతుల రికార్డుల్లో లోపాలను ప్రాథమికంగా గుర్తించారు. ఆర్ఎస్ఆర్‌లో ఏ సర్వే నంబరు భూమి ఏ విభాగంలో ఉందనేది స్పష్టంగా ఉండటంతో రైతులను తిప్పాల్సిన పనిలేకుండా సవరించవచ్చన్న విషయాన్ని తెలుసుకున్నారు. ఇదే విషయాన్ని తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ, గుంటూరు జేసీ భార్గవ్ తేజ దృష్టికి తీసుకువెళ్లారు. వారుకూడా సానుకూలంగా స్పందించారు. దీంతో కేవలం పక్షం రోజుల్లో మూడేళ్లనాటి సమస్యకు పరిష్కారం చూపారు. మిగిలిన జిల్లాల్లోనూ ఇదే తరహా చర్యలకు రెవెన్యూ అధికారులు ముందుకు వస్తే రైతుల కష్టానికి ఊరట లభించినట్టే. తెనాలిలో గుర్తించిన 5,808 రైతుల రికార్డుల్లో 5,763 మంది రికార్డులను సరిదిద్దారు. మరో 45 మంది రైతులకు సంబంధించిన రికార్డుల విషయంలో సాంకేతిక ఇబ్బందులు ఉండటంతో జేసీ దృష్టికి తీసుకువెళ్లామని, వాటికి కూడా త్వరలో పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ గోపాలకృష్ణ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

పరిష్కారం లభించింది



అనారోగ్యంతో ఉన్న కుమారుడు ఫకీర్‌ను బతికించుకునేందుకు 2.61 ఎకరాల భూమిని అమ్ముకోవాలనుకుంటే ప్రభుత్వ భూమి కింద ఉంది అమ్మడానికి కుదరదన్నారు. సంవత్సరంన్నర నుంచి తిరిగినా పట్టించుకున్నవారులేరు. గత నెలలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు అర్జీ పెట్టుకున్నాం. ఆయన స్పందించినా కొందరు అధికారులు లంచాల ఆశతో మా అర్జీకి పరిష్కారం చూపలేదు. పది రోజుల క్రితం మా అబ్బాయి చనిపోయాడు. అదే విషయాన్ని మళ్లీ సీఎం దృష్టికి తీసుకువెళదామని అనుకుంటున్న తరుణంలో రికార్డులు సరిచేశారని, సమస్య పరిష్కారం అయిందని తహసీల్దార్ చల్లని కబురు చెప్పారు. నాతోపాటే చాలా మంది కష్టం తీరిందని తెలిసి సంతోషపడ్డాం. నాకు ఉపయోగపడకపోయినా, మిగిలినవారి అవసరాలకైనా అండగా ఉంటుందనుకున్నాం.

-ఖాజాబీ, తెనాలి

ఎన్నిసార్లు తిరిగామో..



మా భూమిపై మాకు హక్కులేదన్నారు. అడంగల్‌లో చూస్తే ప్రభుత్వ భూమి అని చూపిస్తుంటే, అధికారులను కలసి విన్నవిస్తే, చూస్తాం, చేస్తాం అంటూ మూడేళ్లుగా తిప్పారు. ఎట్టకేలకు సమస్యకు పరిష్కారం లభించింది. చిన్న సవరణకు సంవత్సరాలు పట్టింది. నిజంగా అధికారులు మనస్ఫూర్తిగా చేస్తే మాకు ఇటువంటి సమస్యలు ఉండవు.

-వి.పద్మలత, బుర్రిపాలెం

రైతులకు మేలు జరిగితే చాలని..



నేను తెనాలి తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టాక వచ్చిన ఫిర్యాదుల్లో అధికశాతం భూములకు సంబంధించినవే. ఈ క్రమంలో రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పడం సరికాదని, లోపం ఎక్కడనేది అన్వేషిస్తే అసలు పొరపాటు బయటపడింది. దీనిపై జిల్లా అధికారులకు విన్నవిస్తే సానుకూలంగా స్పందించారు. జేసీ ప్రత్యేక ఉత్తర్వులిచ్చారు. సిబ్బంది రాత్రి పగలు తేడా లేకుండా ఆన్‌లైన్ రికార్డులను సరిచేశారు. మూడేళ్లుగా తిరిగిన రైతులు ఇప్పుడు సంతోషంతో ఉన్నారు.

-గోపాలకృష్ణ, తహసీల్దార్, తెనాలి

బాలోత్సాహం





పెదకాకాని, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు బాలల పండుగ వీవీఐటీ బాలోత్సవ్ 2024 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి కళాశాల ప్రాంగణంలో కోలాహలంగా కొనసాగుతున్నాయి. చిన్నారుల కేరింతలతో రెండో రోజు శనివారం ఉత్సాహంగా పోటీలు జరిగాయి. పెద్దసంఖ్యలో సందర్శకులు హాజరు కావడంతో బాలోత్సవ్ ప్రాంగణం సందడిగా మారింది. 230 పాఠశాలల నుంచి 2500 మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం తదితర అంశాలపై పోటీలు జరిగాయి. ఆయా ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బాలబాలికలచే ప్రదర్శించిన 31 నాటికలు చిన్నారులకు సమాజంపై ఉన్న దృక్పథాన్ని సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా సాగాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని సృజనాత్మకతను వెలికితీశాయి. పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు అనుభవాల మార్పిడి కొత్తదనం నేర్పించడానికి ఉపయోగపడేలా న్యాయ నిర్ణేతలు ప్రత్యేక సూచనలు చేశారు. వాద్య సంగీతంలోని రాగం, తాళం ఆహూతులను ఆకట్టుకున్నాయి. పంచతంత్రం తెలుగు అనువాద గ్రంథం వీవీఐటీ 32వ ప్రచురణను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, బాలోత్సవ్ సృష్టికర్త వాసిరెడ్డి రమేష్‌బాబు ఆవిష్కరించారు.

సందడిగా వీవీఐటీ ప్రాంగణం

కోలాహలంగా కొనసాగుతున్న పోటీలు

తరలివచ్చిన 230 పాఠశాలలు, 2500 విద్యార్థులు


సాంస్కృతిక కార్యక్రమాన్ని తిలకిస్తున్న విద్యార్థులు



పంచతంత్ర పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బాలోత్సవ్ కన్వీనర్ వాసిరెడ్డి విద్యాసాగర్ తదితరులు

రేపటి నుంచి యోగాశిక్షణ శిబిరం ప్రారంభం

నరసరావుపేట టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర యోగా సేవాకేంద్రం ఉచిత శిక్షణశిబిరం 18వ తేదీ నుంచి పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌లో ప్రారంభమవుతుందని నిర్వాహకులు జల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందని అన్నారు, ఆసక్తి గల వారు 9247191553 నంబరును సంప్రదించాలన్నారు.

కనీసం సౌకర్యాలకు నోచుకోని శివారు కాలనీలు

● మున్సిపాలిటీ, పంచాయతీ వారు ఒకరిపై ఒకరు ఆరోపణలు
● కాలనీల అభివృద్ధిని మరిచిన అధికారులు
● వీధిలైట్లు లేక బిక్కుబిక్కుమంటూ కాలంవెళ్లదీస్తున్న ప్రజలు


వెల్లటూరు రోడ్డులోని వీధిలైట్లు లేని విద్యుత్‌స్థంబాలు

వినుకొండ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న మిద్దెబావి బజారు, సుందరయ్యనగర్, టిడ్కో గృహ సముదాయాలు, ద్వారకనగర్ హస్తినాపురం, పండరీపురం, జర్నలిస్టు కాలనీలకు కనీస సౌకర్యాలు లేక స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీరు, వీధిలైట్లు, మురుగుకాల్వలు, సీసీరోడ్ల నిర్మాణం వంటి కనీస సదుపాయాలు కూడ ఇక్కడ లేవు. ఈ కాలనీలు పట్టణానికి సంబంధించినవా లేక జాలలపాలెం, వెంకుపాలెం పంచాయతీకి సంబంధించినవా అనే ప్రశ్న తలెత్తుతుంది. మున్సిపల్ అధికారులను అడిగితే జాలలపాలెం, వెంకుపాలెం పంచాయతీల్లోదని, పంచాయతీ వారిని అడిగితే మున్సిపల్ పరిధిలో ఉన్నాయంటూ ఒకరిపై ఒకరు సాకుగా చూపుతుండడంతో అక్కడ నివసిస్తున్న ప్రజలకు కనీసం మౌలిక వసతులు అందడం లేదు. సాయంత్రం 6 గంటల దాటితే కటిక చీకట్లో కాలం గడుపుతున్నారు. హనుమాన్‌నగర్ చివరి లైన్ వరకు మున్సిపాలిటీ వారి వీధిలైట్లు ఉండగా అక్కడ నుంచి ఘాట్‌రోడ్డు, మిద్దెబావికాలనీ, సుందరయ్యకాలనీ నుంచి జర్నలిస్టు కాలనీ వరకు వీధిలైట్లు లేకపోవడంతో రాత్రిపూట ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతులో పెట్టుకొని గడపాల్సి వస్తుందని ప్రజలు అంటున్నారు. గతంలో ఈ రోడ్డులో ప్రమాదాలు జరిగి కూడా ఇద్దంుే యువకులు మరణించారన్నారు. అంతేగాకుండ చీకటిపడటంతో వీధిలైట్లు లేకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారిపోయాయి. అధికారులు స్పం దించి ఆయా కాలనీలకు మౌలిక సదుపాయాలు కల్పించమని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

● ఇప్పటికి 12 వేల మందికి పైగా చేరిక

చిలకలూరిపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చురుగ్గా జరుగుతోంది. ఇప్పటి వరకు 12,129 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారు. నాదెండ్ల మండలంలో 2,477 మంది, యడ్లపాడు, చిలకలూరిపేట మండలాల్లో 3,686, 2,826మంది చిలకలూరిపేట పట్టణంలో 3,140మంది పార్టీ సభ్యులుగా పేర్లను నమోదు చేసుకున్నారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రత్యేక దృష్టి పెట్టారు. నియోజకవర్గంలోని 12 క్లస్టర్ల ఇన్‌చార్జిలను సమావేశపరిచి వారికి దిశా నిర్దేశం చేశారు. లక్ష్యాలకు అనుగుణంగా సభ్యత్వ కార్యక్రమాన్ని రెండు నెలల్లో పూర్తిచేయాలని వారిని కోరారు. నియోజకవర్గంలో మొత్తం 50 వేల మందిని పార్టీ సభ్యులుగా చేర్చుకునేలా ప్రణాళిక రూపొందించుకుని, ముందుకు సాగాలని ఆయన ఆదేశించారు.

పుస్తకం ఓ మంచి నేస్తం

యడ్లపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పుస్తకం ఓ మంచి నేస్తమని గ్రంథాలయ అధికారిణి సీహెచ్ అంజమ్మ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో శనివారం యడ్లపాడు గ్రంథాలయంలోప్రముఖుల సంస్మరణ, విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో నున్నా హనుమంతరావు, ముత్తవరపు సాంబశివరావు, రామదాసు, హనుమయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

● నాదెండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పట్టణాలతో పాటు గ్రామాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు ఉద్యమం చేసిన ఉద్యమ కారులను ప్రతి ఒక్కరు స్మరించు కోవాలని నాదెండ్ల గ్రంథాలయ అధికారి రావూరి శ్రీనివాసరావు అన్నారు.

● రొంపిచర్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేసిన వారికి అభినందనలను శనివారం తెలిపారు. మండలంలోని రొంపిచర్ల, సంతగుడిపాడు శాఖా గ్రంథాలయాల్లో వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ ప్రముఖులైన ఎస్ఆర్ రంగనాథం, అయంకి వెంకటరమణ, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● వినుకొండ, నవంబర్ 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులు రంగనాధన్, నాగభూషణం, వెంకట రమణయ్యల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు.

● బొల్లాపల్లి, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లిలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ ఉద్యమానికి పాటు పడిన ప్రముఖులను స్మరించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాఠశాల పీ మైకేల్ హాజరయ్యారు.

● ఈపూరు,నవంబరు16(ఆంధ్రజ్యోతి): గ్రంధాలయాలు విజ్ఞాన బాండాగాలని, పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానం పొందవచ్చునని ఎంఈవో-2 రామతులసి అన్నారు.

కొనసాగుతున్న ఆటల పోటీలు

నూజెండ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాత ఉప్పలపాడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మూడో రోజు జోనల్ ఆటల పోటీలు శనివారం ఉత్సాహ భరితంగా సాగాయి. 30 పాఠశాలలకు చెందిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, త్రోబాల్ పోటీల్లో క్వార్టర్స్ గెలుపొందిన జట్లు ఆదివారం ఫైనల్స్ ఆడనున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చిలకలూరిపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట కోటప్పకొండ మార్గంలో శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిలకలూరి పేట మండలం పోతవరం గ్రామానికి బైక్ మెకానిక్ షేక్ కాలేషావలీ (25) దుర్మరణం చెందాడు. ఇతడు బైక్‌పై చిలకలూరిపేటకు వస్తుండగా దారి మధ్యలో పురుషోత్తమపట్నంకు సమీపంలో బైక్ నుంచి కిందపడి మృతి చెందాడు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రెడ్ల వనసమారాధన

వినుకొండటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): యోగివేమారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం రెడ్ల వనసమారాధన కార్యక్రమం వెల్లటూరు రోడ్డులోగల రెడ్ల సంఘం భవనం నందు జరగనుందని అధ్యక్షుడు, సెక్రటరీ ఆరే శివారెడ్డి, సుదాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి, గోపుశ్రీనివాసరెడ్డిలు పాల్గొంటారని తెలిపారు.

సమస్య ఇది.. స్పందించరూ

ఈ గుంతను పూడ్చండి


రైల్వేస్టేషన్‌కు వచ్చే దారిలో ఏర్పడ్డ గుంత

వినుకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏనుగుపాలెం రోడ్డులోని రైల్వే గేటు నుంచి రైల్వేస్టేషన్‌కు వచ్చే రోడ్డుపై రెండు చోట్ల పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చీకటి పడితే గుంతలు కనపడక వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షం పడితే గుంతలోకి నీరు చేరడంతో మరింత ఇబ్బందిగా ఉంటోందని వాహనదారులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను పూడ్చమని వారు కోరుతున్నారు.


టిడ్కో ఇళ్లపై జగన్ సర్కార్ మోసం : చీఫ్‌విప్ జీవీ


అసెంబ్లీ లో మాట్లడుతున్న ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి పేదవారికి సొంతిళ్లు ఇవ్వాలన్న గత టీడీపీ హయాంలో సంకల్పాన్ని జగన్ ప్రభుత్వం నాశనం చేయడమే కాకుండా ప్రజలను అతిదారుణంగా మోసం చేసిన దుర్మార్గపాలన జగన్‌దని చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. టిడ్కో ఇళ్లపై అసెంబ్లీలో శనివారం ఆయన మాట్లాడుతూ జగన్‌కేమో రూ.100కోట్ల ప్యాలెస్‌లు, పేదలకేమో సెంటు స్థలంలో ఇళ్లా అని ధ్వజమెత్తారు. పేదల గృహ నిర్మాణంపై గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి టిడ్కో ఇళ్లే నిదర్శనమని ఆయన అన్నారు. గత టీడీపీ హయాంలో (2014-19) 7లక్షల టిడ్కో ఇళ్లు మంజూరయ్యాయని, అందులో మొదటిదశగా 4లక్షల 50వేల ఇళ్లకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారని వాటిల్లో 2019వ సంవత్సరం నాటికి 3లక్షల 13వేల 832 ఇళ్లు 90శాతం పూర్తిచేశామన్నారు. అలాంటి తరుణంలో ఒక్క అవకాశం అంటూ వచ్చిన జగన్ టిడ్కో ఇళ్లతోపాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఏడాదికి ఐదు లక్షల చొప్పున ఐదు సంవత్సరాల్లో 25 లక్షల ఇళ్లు కట్టిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త ఇళ్లు కట్టిస్తామని చెప్పిన మాట నీటి మూటలు కాగా 90శాతం పూర్తయిన టిడ్కో ఇళ్లను కూడా కనీసం పట్టించుకోలేదని అన్నారు. పేదలకు కట్టిన డిపాజిట్లు కూడా వైసీపీ ప్రభుత్వం తిరిగి చెల్లించలేదన్నారు. వినుకొండ పట్టణంలో పేదల కోసం 4వేల 96 టిడ్కో ఇళ్లు వస్తే 1200 ఇళ్లు 80శాతం పూర్తిచేశామని, వైసీపీ ఐదేళ్ల కాలంలో పట్టించుకోలేదన్నారు. సెంటు స్థలాల పేరుతో జగనన్న కాలనీలు అని పేరు పెట్టి అవి కూడా పూర్తిచేయలేదన్నారు. వచ్చే రెండు సంవత్సరాల లోపు ప్రణాళిక ప్రకారం టిడ్కో ఇళ్లను పూర్తిచేసి పట్టణ పేదలకు అందించాలని మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణను చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కోరారు.

ఈనాం భూముల సమస్య పరిష్కరిస్తే ఐదు లక్షల కుటుంబాలకు లబ్ధి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజుల, జమీందార్‌ల కాలం నాడు అర్చలకు, రజకులకు, భజంత్రీలకు, కళాకారులకు ఇచ్చిన సర్వీస్ ఈనాం భూములు 22ఏ 1సీ కింద నిషిద్ధ జాబితాలో నమోదు చేయటంతో ఆ భూముల యజమానులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం అసెంబ్లీ జీరో అవర్‌లో మాట్లాడారు. ఈ సమస్య చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉందని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఈ భూములను నిషిద్ధ జాబితాలో చేర్చటం వల్ల రిజిస్ట్రేషన్ కాక, క్రయ విక్రయాలు చేసుకోలేక, బ్యాంకుల్లో రుణాలు లభించక ఆ భూముల యజమానులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాంటి భూములు ఒక్క చిలకలూరిపేట నియోజకవర్గంలోనే 1700 ఎకరాల వరకు ఉండగా రాష్ట్ర వ్యాప్తంగా 25వేల ఎకరాల వరకు ఉన్నాయని, చట్ట సవరణ ప్రక్రియ పూర్తి చేసి వీటిని నిషిద్ధ జాబితా నుంచి తొలగిస్తే దాదాపు ఐదు లక్షల పేద కుటుంబాలకు లబ్ది కలుగుతుందని ప్రత్తిపాటి తెలిపారు. 2018లోనే తాను ఈ సమస్యను అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకు రాగా ఆయన స్పందించి ఒక ఆర్డినెన్స్ జారీ చేయించారని, ఐతే ఈ భూములు కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాలో ఉన్నందున చట్టసవరణ కోసం బిల్లు రాష్ట్రపతి ఆమోదం కోసం పంపామన్నారు. ఆమోదం పొందినప్పటికీ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వ అసెంబ్లీలో బిల్లు పెట్టకుండా నిర్లక్ష్యం వహించటంతో సమస్య అలాగే ఉండిపోయిందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా ఈనాం భూములపై మాట్లాడిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక సమస్యను పట్టించు కోకుండా గాలికి వదిలి వేశారన్నారు. అసెంబ్లీలో బిల్లు పెట్టకుండా ఐదు లక్షల కుటుంబాలను జగన్ మోసం చేశాడని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి అసెంబ్లీ సమావేశాల్లో నైనా ఈ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభు త్వానికి విజ్ఞప్తి చేశారు.

కర్ణాటకలో వాటర్ రాఫ్టింగ్ క్యాంపునకు ఎన్‌ఈసీ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బెల్గామ్‌లో జరిగే వాటర్ రాఫ్టింగ్ క్యాంపునకు నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ కాడెట్స్ ఎంపికయ్యారని చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ నెల 17 నుంచి 25 వరకు జరిగే ఈ క్యాంపునకు ఎంపికైన పీ శివరాజ్‌కుమార్, సీహెచ్ మణికుమార్, షేక్ నసీమ్‌లు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి మాట్లాడుతూ ఈ శిబిరంలో మానసిక వత్తిడి ఏ విధంగా అధిగమించాలి, శారీరక ధృఢత్వాన్ని పెంచుకోవటం, ఆత్మవిశ్వాసాన్ని మెరు గుపరుచుకోవడం, టీమ్ వర్క్‌లలో శిక్షణ ఇస్తారన్నారు. వైట్‌వాటర్ రాఫ్టింగ్ క్యాంపునకు ఎంపికైన కాడెట్స్‌ను కళాశాల సెక్రటరీ మిట్టపల్లి రమేష్‌బాబు, ప్రిన్సిపాల్ ఎస్ వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డీ సునీల్, ఎన్‌సీసీ అధికారి మేడికొండ రాజేష్ బాబు, తదితరులు అభినందించారు.

సైబర్ సెక్యూరిటీపై సెమినార్

నరసరావుపేట టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్లూరివారిపాలెంలో ఏఎం రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ భద్రత అనే అంశంపై ఒక రోజు సెమినార్ శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రేషియో స్పియర్ టెక్నాలజీస్ సీఈవో ఎం విజయ కుమార్ మాట్లాడుతూ సైబర్ ముప్పులను, వాటి నివారణకు అవసరమైన ఆధునిక టెక్నాలజీలను గురించి చర్చించారు. సైబర్ స్పేస్‌లో అవగాహన కల్పించడం, విద్యార్థులు ఉద్యోగుల బాధ్యత అన్నారు. ముందుగా కళాశాల కార్యదర్శి ఆట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన అవగాహన పెంపొందించడం అవసరమని అన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ దాడులు ఎలా పెరిగిపోతున్నాయో, వాటి నివారణకు అవసరమైన జాగ్రత్తలపై మరింత దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ మల్లికార్జున, కే కృష్ణరెడ్డి, అన్నిశాఖల హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీఫ్‌విప్ జీవీకి పంచుమర్తి భూపతిరావు శుభాకాంక్షలు


జీవీ ఆంజనేయులు నివాసంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్న పంచుమర్తి భూపతిరావు

వినుకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శాసనసభ చీఫ్‌విప్‌గా నియమితులైన వినుకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులును శనివారం గుంటూరులోని ఆయన నివాసంలో ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాల పట్టుబద్రుల ఎమ్మెల్సీ వినుకొండ నియోజకవర్గ పరిశీలకుడు పంచుమర్తి భూపతిరావు కలిసి శాలువాలతో అభినందించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావలి శ్రీనివాసయాదవ్, గుంటూరు జిల్లా టీడీపీ సీనియర్ నాయకులు అడప శివప్రసాద్, బాబు శ్రీనివాసరావు, మండవ పాములపాటి శ్రీనివాసరావు తదితరులున్నారు.

మురికిపూడి హైస్కూల్‌కు ఎస్‌బీఐ రూ.5.5 లక్షల సాయం


సాయం అందిస్తున్న ఎస్‌బీఐ గుంటూరు డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార ప్రభు

చిలకలూరిపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మురికిపూడిలో ఉన్న కందిమళ్ళ శారదాంబ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు శనివారం ఎస్‌బీఐ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా బ్యాంకు చిలకలూరిపేట కళామందిర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో రూ.5.5 లక్షల విలువ గల ఫర్నిచర్, కంప్యూటర్, వాటర్ కూలర్ ఇతర పరికరాలు అందచేశారు. ఎస్‌బీఐ గుంటూరు పరిపాలనా శాఖ డిప్యూటీ జనరల్ మేనేజర్ కృష్ణకుమార ప్రభు వీటిని హైస్కూలు హెచ్‌ఎం ధనలక్ష్మికి అందజేశారు. సేవా కార్యక్ర మాల్లో తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. ఒంగోలు ఎస్‌బీఐ ఆర్‌ఎం ఎస్ గున్నేశ్వరరావు, బ్రాంచ్ మేనేజర్ పీవీ రమణమ్మ పాల్గొన్నారు.

మహంకాళీ ఆలయ పునర్నిర్మాణానికి రూలక్ష విరాళం


లక్ష విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

నరసరావుపేట రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెంలో ఉన్న మహంకాళీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కార్తీక మాసం శనివారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నరసరావుపేట పట్ట ణంతో పాటుగా చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి పొంగళ్లు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయ పునర్నిర్మాణం కోసం నరసరావుపేట వాస్తవ్యులు కోటపాటి మృత్యుంజయుడు, లక్ష్మీపార్వతి దంపతులు రూ.1,01,116 విలువగల చెక్కును ఆలయ కార్యనిర్వహణ అధికారి నలబోతు మాధవీ దేవికి అందజేశారు. అమ్మవారి తీర్థప్రసాదాలను అర్చకులు, ఈవో దాతలకు అందజేశారు.

ఘనంగా నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్ల


ప్రత్యేక అలంకరణలో నాగమయ్యస్వామి

శావల్యాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : స్థానిక రైల్వేస్టేషన్ మార్గంలోని శ్రీ నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవాలయం వద్ద తిరునాళ్ళ వేడుకలను చైర్మన్ మద్ది గుంట్ల హరిబాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా ప్రారంభించారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్ ఆధ్వర్యంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజాకార్యక్రమాలు చేపట్టారు. గంటవారిపాలెం, మతుకుమల్లి గ్రామాలకు చెందిన భక్తబృందంచే భజనా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం టీటీడీకి చెందిన దాస సాహిత్య ప్రాజెక్ట్ వారిచే కోలాటం నిర్వహించారు.

నారా రామ్మూర్తినాయుడు మరణం విషాదకరం

● చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తినాయుడు మరణం అత్యంత విషాదకరమని చీఫ్‌విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1994-99 మధ్య చంద్రగిరి ఎమ్మెల్యేగా ఆయన ప్రజాసేవతోపాటు పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని అన్నారు. రామ్మూర్తినాయుడు ఆత్మకు శాంతిచేకూరాలని, ఆయన కుటుంబసభ్యులకు జీవీ సానుభూతి తెలిపారు.

గోనుగుంట్ల కోటేశ్వరరావు సంతాపం

రొంపిచర్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతికి రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. టీడీపీ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

వైసీపీ నేతపై పోలీసులకు ఎంపీడీవో ఫిర్యాదు

నాదెండ్ల, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలపరిషత్ స్థలాన్ని ఆక్ర మించి షాపులు నిర్మించి అద్దెకు ఇచ్చిన వ్యవహారంపై చిరుమామిళ్ళ గ్రామానికి వెళ్లిన ఎంపీడీవో దుర్భాషలాడి బెదిరింపులకు పాల్పడిన వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డిపై నాదెండ్ల ఎంపీడీవో ఎస్ స్వరూపరాణి పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. తహసీల్దార్, మండల సర్వేయర్, వీఆర్‌వోల నివేదిక మేరకు మండల పరిషత్ స్థలం సర్వే నెంబరు 173ఏ నందు 67 చదరపు మీటర్లు ఆక్రమించి షిరిడీ సాయిబాబా ట్రస్ట్ వారు నాలుగు షాపులు నిర్మించి అద్దెకు ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు మేకల రామిరెడ్డి విచారణకు హాజరు కాకుండా ఆయన తరఫున సింగారెడ్డి కోటిరెడ్డి హాజరయ్యారని తెలిపారు. తనను సబార్డినేట్స్ ఎదుట దుర్భాష లాడటమే కాకుండా ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఒత్తిడి తీసుకువచ్చారని వివరించారు. తన విధులకు ఆటంకం కలిగించిన కోటిరెడ్డిపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదులో కోరారు. కాగా ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు కోటిరెడ్డిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు సమాచారం.

ఎమ్మెల్సీ ఓట్ల పరిశీలన ప్రక్రియపై అసంతృప్తి

చిలకలూరిపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభ ద్రుల నియోజకవర్గ ఎన్నికకు సంబంధించిన ఓట్ల పరిశీలనా ప్రక్రియపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఇందుకు సంబంధించి అధికారులు సమావేశం నిర్వహించారు. ఓటరు దరఖాస్తుల పరిశీలన సందర్భంలో ఓటర్ల అర్హతల విషయంపై బీఎల్‌వోలకు పూర్తిగా అవగాహన లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పలు సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వారు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అర్హత ఉన్న వారి దరఖాస్తులను తిరస్కరిస్తే, వారి పక్షాన న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామని అన్నారు. టీడీపీ తరఫున మురకొండ మల్లిబాబు, అజ హరుద్దీన్, సాంబశివరావు(జనసేన), వి.శ్రీనివాసరావు(వైసీపీ), చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల తహసీల్దారులు, చిలకలూరిపేట మున్సిపల్ టీపీఎస్ సమావేశంలో పాల్గొన్నారు.

రేపు కాకతీయ సేవాసమితి కార్తీక వనభోజన మహోత్సవం

చిలకలూరిపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామి కల్యాణ మండపంలో కార్తీక వనభోజన మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు శనివారం తెలిపారు.

25 శాతం రాయితీపై శనగ విత్తనాలు

● ఎంఏవో ఏ హరిప్రసాదు

ఫటా ఫట్



నాదెండ్ల, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వటం ద్వారా అధిక దిగుబడులు సాధించేందుకు వ్యవసాయశాఖ కృషి చేస్తుందని ఏవో ఏ హరిప్రసాదు తెలిపారు. రాయితీపై విత్తనాల పంపిణీ.. తదితర అంశాలపై ఆయన ఫటాఫట్‌లో చెప్పారు

ప్ర: రైతులకు ఎలాంటి రాయితీలు అందిస్తున్నారు?

జ: ప్రస్తుతం రైతులకు 25 శాతం రాయితీపై శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నాం. 350 క్వింటాళ్లు రైతు సేవాకేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి.

ప్ర: అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఎప్పుడు సాయం అందిస్తారు?

జ: ప్రభుత్వం బడ్జెట్‌లో అన్నదాత సుఖీభవ కింద వ్యవసాయ పని ముట్ల రాయితీకి నిధులు కేటాయించింది. ప్రభుత్వ ఆదేశాలతో అమలు చేస్తాం.

ప్ర: రైతుల కోసం ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు?

జ: ప్రతి మంగళ, బుధవారాల్లో క్షేత్ర స్థాయిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం ద్వారా పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: మండలంలోని ఎరువుల కొరత ఏమైనా ఉందా?

జ: సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలు, జీడీసీ ఎంఎస్ కేంద్రం ద్వారా రైతులకు ఎరువులు అందిస్తున్నాం. ఎలాంటి కొరత లేదు.

ప్ర: రైతులకు మీశాఖ తరఫున ఇచ్చే సూచనలు ఏమిటి?

జ: రైతులు ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోలు చేసిన సమయంలో విధిగా షాపు నుంచి రసీదు పొందాలి.

ఎస్‌ఎస్‌ఎన్‌లో పుస్తక, ఫొటో ప్రదర్శన ప్రారంభం


పుస్తక, ఫొటో ప్రదర్శన ప్రారంభిస్తున్న కపిలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయ గుప్త తదితరులు

నరసరావుపేట టౌన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల గ్రంథాలయంలో వారోత్సవాల సందర్భంగా అరుదైన పుస్తకాల, మహాత్మాగాంధీ జీవిత చరిత్రపై, 111 మంది తెలుగు సాహితీ మూర్తుల ముఖచిత్రాలు - జీవిత విశేషాలు, వారి రచనలకు సంబంధించిన ఫొటోల ప్రదర్శన శనివారం నిర్వహించారు. కళాశాల అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ కళాశాల గ్రంథాలయం 70వేల పుస్తకాలు కలిగి, విశ్వవిద్యాలయం స్థాయిలో ఉత్తమ గ్రంథాలయంగా అవార్డు పొందిందన్నారు. క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ ఊటుకూరి వెంకట అప్పారావు, కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్ సుదీర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాససాయి, గ్రంథాలయాధికారి, రామాంజనేయరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.